

జన కేతనం

▸ విభిన్నం... విశాఖ ఫలితం

▸ మూడు తరాలుగా రాజకీయాల్లో...

▸ ఒకటే వార్డు... రెండు నియోజకవర్గాల్లో ఓట్లు

10లో

ముగిసిన నామినేషన్ల పరిశీలన

లోక్‌సభ స్థానానికి 39 మంది నామినేషన్లు వేయగా ఆరుగురివి తిరస్కృతి

- ఏడు అసెంబ్లీ స్థానాలకు 147 మంది నామినేషన్లు...
- 28 మంది నామినేషన్లు తిరస్కృతి
- పెందుర్తి, విశాఖ తూర్పు నియోజకవర్గాల్లో కొద్దిసేపు ఉత్కంఠ

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరిగింది. విశాఖ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాల నామినేషన్ల పరిశీలన ఉదయం పది గంటల నుంచి ప్రారంభమైంది. లోక్‌సభకు 39 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ఆరుగురి నామినేషన్లను, ఏడు అసెంబ్లీ స్థానాలకు 147 మంది నామినేషన్లు వేయగా 28 మంది నామినేషన్లు సక్రమంగా లేవని అధికారులు తిరస్కరించారు. పార్లమెంటు స్థానానికి 33, అసెంబ్లీ సెగ్మెంట్లకు 119 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని వెల్లడించారు.

విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి దాఖలైన మొత్తం 39 నామినేషన్లలో ఆరింటిని ఆర్‌వో, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తిరస్కరించారు. మిగిలిన 33 సక్రమంగా ఉన్నట్టు నిర్ధారించారు. పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్‌శర్మ, పోలీస్ పరిశీలకులు అమిత్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ఆర్‌వో, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కో నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అఫిడవిట్ పత్రంలో సంతకం చేయని కారణంగా స్వతంత్ర అభ్యర్థి మెహబూబ్ సుభాన్ నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్టు ఆర్‌వో ప్రకటించారు. అలాగే ఫార్మెట్ ప్రకారం దరఖాస్తు సమర్పించని కారణంగా స్వతంత్ర అభ్యర్థి వియ్యపు గంగరాజు, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థి నక్క నమ్మిగ్రేస్ నామినేషన్లను తిరస్కరిస్తున్నట్టు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ, వైసీపీ ప్రధాన అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా వేసిన మతుకుమిల్లి తేజస్విని, బొత్స అనూషల నామినేషన్లను తిరస్కరిస్తున్నట్టు ఆర్‌వో స్పష్టం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన పట్టపగలు రాజారమేష్ పత్రాల్లో ప్రతిపాదించిన వారి సంతకాలన్నీ ఒకేలా ఉండడంతో ఆర్‌వో అభ్యంతరం వ్యక్తంచేసి సంబంధిత అభ్యర్థి వివరణ కోరారు. ఆయన ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని ఆర్‌వో నామినేషన్‌ను తిరస్కరించారు. బ్లూ ఇండియా పార్టీ తరపున మురాల అరుణశ్రీ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి దేవర శంకర్ వేసిన నామినేషన్లతో ఫామ్-ఏ, ఫామ్-బి సరిగా లేని కారణంగా ప్రపోజల్స్ సంతకాలను పరిగణనలోకి తీసుకుని స్వతంత్ర అభ్యర్థులుగా గుర్తించి ఆర్‌వో ఆమోదం తెలిపారు.



నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో అమిత్‌శర్మ, అమిత్‌కుమార్, కలెక్టర్ మల్లికార్జున

ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 28 తిరస్కృతి..

భీమిలి అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 20 మంది నామినేషన్లు దాఖలు చేయగా 17 మందివి ఆమోదించి, ముగ్గురివి తిరస్కరించారు. తెలుగుదేశం అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ప్రత్యామ్నాయ అభ్యర్థిగా ఆయన తనయుడు గంటా రవితేజ, కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజుకు డమ్మీగా ఆయన సతీమణి స్వప్న అడ్డాల, వైసీపీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ప్రత్యామ్నాయ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి నామినేషన్లను తిరస్కరించారు. విశాఖ తూర్పులో మొత్తం 23 నామినేషన్లలో 15 సక్రమంగా ఉన్నట్టు ఆర్వో మయూర్ అశోక్ వెల్లడించారు. మరో ఎనిమిది నామినేషన్లు సక్రమంగా లేని కారణంగా తిరస్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు, ఎంవీవీ సత్యనారాయణ, గుత్తుల శ్రీనివాసరావుకు ప్రత్యామ్నాయంగా వెలగపూడి సుజన, ముళ్లపూడి నాగజ్యోతి, మోనిక నామినేషన్లు తిరస్కరించారు. ఇంకా కె.శ్రీనివాసరావు, ఇ.సురేష్, ఇ.రజని, వి.గోవిందు, ఎస్.సుశీల అనేవారి నామినేషన్లు సక్రమంగా ... మిగతా 8వ పేజీలో

ప్రాణాలు తీస్తున్న చీప్ లిక్కర్

వైసీపీ పాలనలో నాసిరకం మద్యం ప్రవాహం

- అధికార పార్టీ నేతల చేతుల్లో గల డిస్టిలరీల్లో తయారీ
- బ్రాండెడ్ మద్యం స్థానంలో సొంత బ్రాండ్లు విక్రయం
- గత్యంతరం లేని పరిస్థితుల్లో తాగేస్తున్న మందుబాబులు
- కాలేయం, జీర్ణాశయం, దృష్టి సమస్యలు
- కేజీహెచ్‌కు ప్రతిరోజూ 30 వరకూ ఓపీ నమోదు
- తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని ఇన్‌పేషెంట్‌లుగా చేర్చుకుని చికిత్స

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తాను అధికారంలోకి వస్తే దశల వారీగా మద్య నిషేధం అమలు చేస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. దశలవారీగా మద్యాన్ని తగ్గించి పేదలకు అందుబాటులో లేకుండా కేవలం స్టార్ హోటళ్లకే విక్రయాలను పరిమితం చేస్తామన్నారు. మద్య నిషేధం చేసిన తరువాతే మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తానన్నారు. ఆయన ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోగా మరింత నాసిరకం మద్యాన్ని తీసుకువచ్చారు. ఏమాత్రం నాణ్యత లేని ఆ చీప్ లిక్కర్ మందుబాబుల ప్రాణాలను హరిస్తోంది. ప్రభుత్వ దుకాణాల్లో విక్రయిస్తున్న నాసిరకం మద్యం తాగుతున్నవారి కాలేయం, జీర్ణాశయం దెబ్బతింటున్నాయి. ఇంకా కంటిచూపు సమస్యలు కనిపిస్తున్నాయి. ఒకేసారి శరీర అవయవాలు పనిచేయకపోవడంతో ఆస్పత్రిలో చేరాల్సి వస్తోంది. కొంతమంది అప్పటికి ప్రాణాపాయం నుంచి బయటపడినా, చాలామంది మృత్యువు నుంచి తప్పించుకోలేక పోతున్నారు. మద్యం తాగడం వల్ల అనారోగ్యం పాలైన కేసులు కేజీహెచ్‌కు నిత్యం 30 వరకూ వస్తున్నాయి.



కేజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్

సంవత్సరం	అమ్ముడైన మద్యం విలువ (రూ.కోట్లలో)
2019-20	రూ.767.92 కోట్లు
2022-23	రూ.1952.33 కోట్లు
2023-24	రూ.2061.3 కోట్లు



ధర కూడా గతం కంటే రెట్టింపు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ రూ.60 నుంచి రూ.70 మధ్య విక్రయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తమ సొంత మనుషుల డిస్టిలరీల్లో తయారైన బ్రాండ్లను విక్రయిస్తున్నారు. మొదట్లో క్వార్టర్ బాటిల్ రెట్టింపు (రూ.120 నుంచి రూ.140) ధరకు అమ్మారు. దశలవారీగా రూ.200 చేశారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్నాయని ఆరేడు నెలలుగా తగ్గించుకుంటూ వచ్చి ప్రస్తుతం రూ.130కి విక్రయిస్తున్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా మద్యం పాలసీని ప్రకటించింది. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. మద్యం తయారుచేసే డిస్టిలరీలు కూడా వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లాయి. అధిక లాభాల కోసం నాణ్యత లేని మద్యం తయారుచేసి ఏదో ఒక బ్రాండ్‌తో మార్కెట్‌లోకి వదులుతున్నాయి. ప్రీమియం బ్రాండ్లు అయిన బ్లాక్‌డాగ్, 100 పైపర్స్, టీచర్స్, బ్లెండర్‌స్ప్రైడ్, సిగ్నేచర్ వంటి బ్రాండ్ల సరఫరాను నియంత్రించి, తమ సొంతబ్రాండ్‌లు మద్యం విక్రయాలు పెరిగేలా అబ్కారీ శాఖ అధికారులకు ఆదేశాలివ్వడం మొదలెట్టారు. మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం మాత్రమే అందుబాటులో ఉండడంతో మందుబాబులు ... మిగతా 8వ పేజీలో

ఓటర్లకు వలంటీర్ల ఫోన్లు

- బయోమెట్రిక్ వేస్తే... వైసీపీ నేతలు రెండు రోజుల్లో డబ్బులు వేస్తారట

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

వార్డు వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం చాలా స్పష్టంగా చెప్పినా విశాఖపట్నంలో వైసీపీ నాయకులు వదలడం లేదు. వారితో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. తాజాగా నగరంలోని ఒక నియోజకవర్గంలో ఓటర్లకు వలంటీర్లు ఫోన్లు చేసి, ఓటరు గుర్తింపు కార్డులు తీసుకుని ఫలానా చోటకు రావాలని కోరుతున్నారు. శని, ఆదివారాల్లో వస్తే...బయోమెట్రిక్ తీసుకుంటామని, ఆ తరువాత మీ ఖాతాలో వైసీపీ నాయకులు డబ్బులు వేస్తారని వారు చెబుతున్నారు. ఈ విషయం కొంతమంది 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి ఫోన్ చేసి చెప్పారు.

నేడే పాలిసెట్

- 13,200 మంది విద్యార్థులు
- జిల్లాలోని 28 కేంద్రాల్లో నిర్వహణ
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

కంచరపాలెం, ఏప్రిల్ 26: పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్)-2024 శనివారం జరగనుంది. జిల్లావ్యాప్తంగా 28 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పాలిసెట్ కో-ఆర్డినేటర్ డా.కె.నారాయణరావు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు 13,200 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. నగరంలో 19, పెందుర్తి, భీమిలి పరిధిలో తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం తొమ్మిన్నర గంటల నుంచే అభ్యర్థులను అనుమతిస్తామని, నిమిషం ఆలస్యమైనా అనుమతించే అవకాశం లేదన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఐడీ కార్డు, హెచ్‌బీ పెన్సిల్ మాత్రమే తీసుకురావాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

శత శాతం ఓటింగ్‌కు 'స్వీప్'

- 8వ పేజీలో

అధ్వానంగా పార్కులు

గాలికొదిలేసిన జీవీఎంసీ

కళ తప్పిన బీచ్‌రోడ్డులోని ఆల్ ఎబిలిటీ పార్కు

- టీడీపీ హయాంలో రూ.3.5 కోట్లతో నిర్మాణం
- ఇప్పుడు నిర్వహణ లేకపోవడంతో మరమ్మతుకు గురైన పరికరాలు
- ముడసర్లోవ పార్కు పరిస్థితి మరింత దయనీయం
- నగరవాసులు తీవ్ర ఆగ్రహం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఎప్పటినుంచో ఉన్న పార్కుల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. పాలకుల ఆదేశాల మేరకు పార్కుల నిర్వహణకు వినియోగించాల్సిన నిధులను జీవీఎంసీ అధికారుల ఇతర అవసరాలకు మళ్లించేశారు. దీనివల్ల ప్రధాన పార్కులైన బీచ్‌రోడ్డులోని ఆల్ ఎబిలిటీ పార్కు, ముడసర్లోవ పార్కుల్లో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటుచేసిన పరికరాలన్నీ పాడైపోయినా మరమ్మతుకు నోచుకోవడంలేదు.



బీచ్‌రోడ్డులోని ఆల్ ఎబిలిటీ పార్కులో పాడైపోయిన చిన్నారుల జారుడుబల్ల



ముడసర్లోవ పార్కులో ధ్వంసమైన షెల్టర్

స్మార్ట్ సిటీగా గుర్తింపు పొందిన విశాఖ నగరంలో ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన పరిస్థితులు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో టీడీపీ హయాంలో పార్కుల అభివృద్ధిపై దృష్టిసారించారు. బీచ్‌రోడ్డులో కొత్తగా పార్కు నిర్మాణానికి రూపకల్పన చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులు సేదతీరేలా, ఆహ్లాదం పొందేలా 2,156 చదరపు మీటర్ల స్థలంలో రూ.3.5 కోట్లతో 'ఆల్ ఎబిలిటీ పార్క్'ను 2018లో ప్రారంభించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన పార్కు కావడంతో నగరవాసులతోపాటు బీచ్‌కు వచ్చే పర్యాటకులు ఈ ఆల్ ఎబిలిటీ పార్కును సందర్శించేవారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో పార్కు నిర్వహణను గాలికి వదిలేశారు. పార్కులో ఆట పరికరాల నిర్వహణను పట్టించుకో లేదు. పాడైపోయిన వాటిని తిరిగి మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవడాన్ని విస్మరించారు. దీంతో పార్కులోని పరికరాలన్నీ పాడైపోవడం, ... మిగతా 8వ పేజీలో

ఐదు రోజులు మంటలే...

తూర్పు, దక్షిణ భారతంలో తీవ్ర వడగాడ్పులు

- రాయలసీమ, తెలంగాణలోనూ గాల్పుల తీవ్రత
- వచ్చే నెలలో మరింత వేడిగాలులు...
- 45 డిగ్రీలు దాటి నమోదయ్యే అవకాశం
- వాతావరణ నిపుణుల హెచ్చరిక
- గత ఏడాది రికార్డు దాటొచ్చని అంచనా

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

మునుపెన్నడూ లేనంతగా ఎండ వేడి, తీవ్ర వడగాడ్పులతో దేశంలోని అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. రోహిణి కార్తెకు మరో నెల రోజుల సమయం ఉండగానే రోళ్లు బద్దలయ్యేలా కాస్తున్న ఎండలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. అయితే ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ముందే హెచ్చరించారు. కానీ, అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నెల రోజుల నుంచి నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, ఎండలు, గాడ్పుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని గతేడాదికంటే ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ సీనియర్ అధికారి డీఎస్ పాయ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇప్పటివరకు 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని, అయితే ఈ ఏడాది ఆ రికార్డును అధిగమిస్తుందని అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో తీవ్రమైన వడగాడ్పులు వీయడంతో కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీలు, అక్కడక్కడా అంతకుమించి నమోదుకావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కాగా, రానున్న ఐదు రోజుల్లో దక్షిణాదిలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, వీటికి ఆనుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగడమే కాకుండా వడగాడ్పులు వీస్తాయని ... మిగతా 8వ పేజీలో



నంద్యాలలో 45.5 డిగ్రీలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45.5 డిగ్రీలకు చేరాయి. శుక్రవారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. విజయనగరం జిల్లా కొత్తవలసలో 44.2, మన్యం జిల్లా సాలూరులో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 41 మండలాల్లో తీవ్రంగా, 116 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరనుంది. శనివారం..శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, రాష్ట్రవ్యాప్తంగా 183 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెరిగిన నేపథ్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

బోసిపోతున్న గంగవరం పోర్టు

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

పెదగంట్యాడ, ఏప్రిల్ 26: కార్మికులు సమ్మెబాట పట్టడంతో అదానీ గంగవరం పోర్టు బోసిపోయింది. నిత్యం వేలాది మంది కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్‌కు వినియోగించే క్రేన్‌లు, డంపర్‌లు, లోడర్‌లతో ఎంతో సందడిగా ఉండే గంగవరం పోర్టు ప్రస్తుతం నిర్మానుష్యంగా మారింది. గంగవరం పోర్టు లోపల, ప్రధాన గేటు ఎదుట కార్మికులు గడిచిన పద్దెనిమిది రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. బందోబస్తుగా వందలాది మంది పోలీసులు ఉంటున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

అదానీ గంగవరం పోర్టులో తొమ్మిది బెర్తులు ఉన్నాయి. ఈ బెర్తుల ద్వారా నౌకలలోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతుంది. బొగ్గు, ఐరన్‌ఓర్, ఎరువులు, లైమ్‌స్టోన్, అల్యూమినియం రోల్స్, గోధుమలు, బియ్యం..వంటివి ఎగుమతి, దిగుమతి అవుతుంటాయి. ఈ పనుల్లో వివిధ ట్రేడ్లకు చెందిన సుమారు రెండున్నర వేల మంది కార్మికులు ఉన్నారు. ఇందులో 516 మంది స్థానికులు కాగా, మిగిలిన వారంతా స్థానికేతరులు. తమకు వేతనాలు పెంచాలని, కుటుంబంలో ఎవరైనా అనారోగ్యం పాలైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం ఉచితంగా అందించాలని, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెకు దిగారు. కార్మికుల డిమాండ్ల విషయంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోవడంతో పోర్టులో కార్యకలాపాలు నిలిచిపోయాయి.



బోసిపోయిన అదానీ గంగవరం పోర్టు బెర్తులు

ఏపీని వ్యాపార సంస్థగా మార్చేశారు

▸ జగన్‌పై ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు ధ్వజం



51వ వార్డులో ప్రచారం చేస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఏప్రిల్ 26: ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని వ్యాపార సంస్థగా మార్చి ఏటా రూ.30వేల కోట్లు దోచుకున్నట్టు ఆధారాలున్నాయని ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీకి ఓటు వేస్తే పిల్లల భవిష్యత్తుకు ఉరితాడు వేసినట్టేనన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీల కూటమి అభ్యర్థిగాతనకు 40 వేల మెజారిటీ వస్తుందన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, వేల్పూరు శ్రీనివాసరావు, నాయకులు సురేష్ బాబు, త్రినాద్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

51వవార్డులో ప్రచారం

మాధవధార; విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వవార్డు సీతన్న గార్డెన్స్, ఏకలవ్య కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఉమ్మడి అభ్యర్థి పి. విష్ణుకుమార్ రాజు నాయకులతో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని అన్నారు.ఏకలవ్య కాలనీ వాసులు తమ సొంతింటి కల నెరవేరడం లేదని విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నార్త్ ఇన్‌చార్జి మహమ్మద్ నజీర్, జనసేన సమన్వయకర్త ఉషాకిరణ్ తదితరులు, బీజేవైఎం నాయకులు దిలీప్, టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి కార్యకర్తలు ఉన్నారు.

విష్ణుకుమార్‌రాజు కుమార్తె ప్రచారం

సీతమ్మధార: ఉత్తర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కుమార్తె శ్యామల దీపిక కోరారు. ఈ మేరకు ఆమె గురుద్వారా ఆటో స్టాండ్‌లో డ్రైవర్లను కలిసి కమలంగుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. పలు ప్రాం తాల్లో స్థానికులకు కలిసి కరపత్రాలను పంచిపెట్టారు.



మహిళకు కరప త్రాలందిస్తున్న శ్యామల దీపిక

48వార్డులో విస్తృత ప్రచారం

కంచరపాలెం: ఉత్తర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, విశాఖ ఎంపీ భరత్‌ను గెలిపించాలని కోరుతూ, 48వార్డులో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు సత్యాడ అప్పారావు పాల్గొన్నారు.



ఐటీ రంగ ప్రతినిధులతో విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి శ్రీభరత్ సమావేశం



హోటల్ మర్చెంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీభరత్

ఐటీ పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళికలు

▸ టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

సిరిపురం, ఏప్రిల్ 26 : నగరంలో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని ప్రణాళికలు రూపొందిస్తామని విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి ఎం. శ్రీభరత్ అన్నారు. శుక్రవారం ఆయన బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఐటీ రంగానికి చెందిన ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లుగా విశాఖలో ఐటీ రంగం అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఐటీ రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని విమర్శించారు. ఐటీ కంపెనీలకు చెల్లించాల్సిన రాయితీల బకాయిలు చెల్లించకపోవడం, కొత్త వాటిని ప్రోత్సహించకపోవడంతో ఉన్న కంపెనీలు కూడా ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన అనేక కంపెనీలు వైసీపీ తీరు వల్ల వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. ప్రస్తుతం విశాఖలో ఉద్యోగ అవకాశాలు లేక ఎంతోమంది యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖలో ఐటీ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పి స్తామని తెలిపారు. చంద్రబాబునాయుడు చొరవ వల్ల హైదరాబాద్‌లో ఐటీ రంగం బాగా స్థిరపడిందని, ఇక్కడికి కూడా స్కిల్ బెస్ కోర్సులను తీసుకొచ్చి స్థానిక యువతకు శిక్షణ ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో విశాఖ ఐటీ పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై పరిశ్రమల పరిస్థితిని భరత్‌కు వివరించారు.

ఆతిథ్య రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తాం

మహరాణిపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో ఆతిథ్య రంగానికి పరిశ్రమ హోదా కల్పించేందుకు కృషి చేస్తామని విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం. శ్రీభరత్ తెలిపారు. హోటల్ దసపల్లాలో శుక్రవారం విశాఖ హోటల్ మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఆతిథ్య రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖలో ఆతిథ్యరంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి మరింత మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశానికి వచ్చిన ప్రతినిధులనుంచి ఆయన వివరాలను కోరారు. విశాఖలో 1500 వరకు హోటల్స్, రెస్టారెంట్లు ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 1.80 లక్షల మంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా పర్యాటక రంగం కుంటుపడటంతో దాని ప్రభావం ఆతిథ్య రంగంపై చూపినట్టు వివరించారు. దీనితో మనుగడ సాగించడం కష్టతరం అవుతుందని తెలిపారు. అనంతరం భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాత్రి 12 గంటల వరకు హోటల్స్ నిర్వహించుకొనేలా జీవో ఇస్తామన్నారు. విశాఖలో ఐటీతోపాటు ఆతిథ్య పరిశ్రమ కూడా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చేయడం ద్వారా ఆతిథ్యం రంగానికి ఊతమిచ్చినట్లవుతుందని వివరించారు.

స్థానిక ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈసమావేశంలో కూటమి నియోజకవర్గ అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు , విష్ణుకుమార్ రాజు, గణబాబు, పల్లా శ్రీనివాస్ , నాయకులు సీతంరాజు సుధాకర్, ఒమ్మి సన్యాసిరావు, కందుల నాగరాజు, సాయిరాం సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో హోటల్ నిర్వహకులు పాల్గొన్నారు.



29వ వార్డులో హైపర్‌ఆదితో కలిసి ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ



చెంగలరావుపేట మసీదు కమిటీ పెద్దలు భేటీ

పాలన మారాలి.. కూటమి ప్రభుత్వం రావాలి

▸ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీ కృష్ణ

మహరాణిపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో వైసీపీ పాలనను ఓడించి.. కూటమి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ, సినీ, జబర్దస్త్ నటుడు హైపర్‌ఆది అన్నారు. 29వ వార్డు చందకవీధి, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేటల్లో కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ. హైపర్‌ఆదితో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమయ్యారు. అసెంబ్లీకి గాజు గ్లాసు గుర్తు, ఎంపీకి సైకిల్ గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావటం తథ్యమని అన్నారు. ఈ సందర్భంగా హైపర్‌ఆదితో యువత సెల్ఫీలు తీసుకొనేందుకు జనాలు పోటీపడ్డారు. కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ, కందిపల్లి సతీశ్, పుచ్చా విజయ్ కుమార్, చొల్లంగి శేఖర్, గణేష్, బుద్దల అనురాధ పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి చేయూత

పూర్ణామార్కెట్: ముస్లిం వర్గాల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. 36వ వార్డు చెంగలరావుపేట మసీద్ ఏరియాలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల అభివృద్ధితోపాటు వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు చేపడతామన్నారు. ఈ నేపథ్యంలో ముస్లిం మసీద్ కమిటీ పెద్దలు ఆయనను కలిసి సంపూర్ణమద్దతు ప్రకటించారు.

అక్కయ్యపాలెం: దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా సినీ, జబర్దస్ నటుడు హైపర్ ఆది 27వ వార్డు దొండపర్తిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామాలయంవీధిలో ప్రారంభమైన ప్రచారం పలు ప్రాంతాల్లో సాగింది. కార్యక్రమంలో 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు పాలికల బాబి, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం

▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న గండిబాబ్జి

మహరాణిపేట, ఏప్రిల్ 26: కూటమి అభ్యర్థుల గెలుపు ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్య మంత్రిని చేయటమే ధ్యేయంగా కృషి చే యాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాల యంలో దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి నియమితులైన సీతంరాజు సుధాకర్‌ను నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ వైసీపీలో పనిచేసే కార్యకర్తలకు విలువ లేదని, టీడీపీలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలను గుర్తిస్తుందన్నారు. రాష్ట్రానికి చంద్ర బాబు నాయకత్వం అవసరమని, అందుకే తనతోపాటు వందలాది మంది టీడీపీలో చేరామన్నారు. వైసీపీ కార్యకర్తలకు గానీ, ప్రజలకు గాని ఉపయోగపడదని ఆలస్యంగా గుర్తించామని తెలిపారు.

దక్షిణంలో కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యం: సీతంరాజుసుధాకర్

జగదాంబ కూడలి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి దక్షిణ అభ్యర్థి వంశీ కృష్ణ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని టీడీపీ దక్షిణం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం 35వ వార్డు రామకృష్ణా జంక్షన్ వద్ద టీడీపీ ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా నియోజవర్గాన్ని దోచుకుతిన్న వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్ ఓడించాలన్నారు. ముందుగా టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని సీనియర్ కార్పొరేటర్ కొప్పుల వెంకటరరావు ప్రారంభించారు. కార్య క్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, గోడి నరసింహాచారి, కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, నాయకులు ఎర్నాగుల జగదీష్, నందమూరి అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

విశాఖపట్నం, ఏప్రిల్ 26: భువనేశ్వర్ ప్రాంతానికి చెందిన కర్రి మోహనరెడ్డి (42) అనేవ్యక్తి విశాఖ రైల్వే స్టేషన్‌లో అదృశ్యమైనట్టు స్థానిక రైల్వే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 11న భువనేశ్వర్ నుంచి విశాఖ చేరుకున్న మోహన్‌రెడ్డి తన భార్యతో వీడియోకాల్ మాట్లాడిన తర్వాత మొబైల్ స్విచ్ఛాఫ్ అయింది. తర్వాత ఇంటికి చేరకపోవడం, ఫోన్ చేయకపోవడంతో విశాఖ పరిసరాల్లో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో మోహన్‌రెడ్డి భార్య శుక్రవారం రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి తెలుపుఛాయతో బ్లాక్ కలర్ ప్యాంటు, వైట్ కలర్ టీ షర్టు ధరించినట్టు, ఆచూకీ తెలిసినవారు జీఆర్పీ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు ఫోన్: 9440627547 లేదా ఎస్‌ఐ జి.శ్రీనివాస్ 9866413487కు సమాచారమివ్వాలన్నారు. రైటప్ :

శతశాతం ఓటింగ్‌కు స్వీప్

జిల్లా నోడల్ అధికారి రామారావు



ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో శతశాతం ఓటింగ్ నమోదుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వీప్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమశాఖ సంచాలకులు కె.రామారావును నియమించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో స్వీప్ కార్యక్రమాల నిర్వహణకు ప్రతి నియోజకవర్గానికి 21 మంది చొప్పున సిబ్బందిని నియమించారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇంటింటా ఓటరు చైతన్యం ద్వారా ప్రతి ఒక్కరూ ఓటు వేయాల్సిన ఆవశ్యతకను తెలియజేస్తారు. ఓటర్ల హక్కులు, విధులను కరపత్రాల రూపంలో అందిస్తారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బూత్ స్థాయి చైతన్య సంఘాలు ఏర్పాటు చేసి చైతన్యపర్చనున్నారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు రామారావు వెల్లడించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కూటమిని గెలిపించాలి

▸ ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయన్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26: రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అధికారంలో వచ్చిన తర్వాత విశ్రాంత ఉద్యోగులకు ఒకటో తేదీన రావాల్సిన పెన్షన్ ప్రతినెలా 20వ తేదీ వరకు చెల్లించడంలేదన్నారు. నాలుగున్నరేళ్లుగా పీఆర్సీ లేకుండా చేశారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పెన్షనర్లకు 10 శాతం పెంచి పెన్షన్ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా చంద్రబాబు 40 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినట్టు గుర్తుచేశారు. జగన్‌ను వైఎస్సార్ కుమారుడిగా భావించామని, అయితే, నాలుగున్నరేళ్లుగా పెన్షనర్లకు అన్యాయం చేశారని మండిపడ్డారు. మెడికల్ బిల్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని, హెల్త్‌కార్డులను అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పవిత్రమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద డ్యూటీ వేసి అప్రతిష్ట పాలుచేశారన్నారు. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని, విశాఖలో రుషికొండను బోడిగుండు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. 32 వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ స్థితిలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రావాలన్నా సమర్థత కలిగిన చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జనరల్ సెక్రటరీ పెద్దన్న గౌడ్, సెక్రటరీ పీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి టి. నాగభూషణం, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

అధ్వానంగా పార్కులు

... 7వ పేజీ తరువాయి

రక్షణ గోడ కూలిపోయినా తిరిగి నిర్మించడంలో జాప్యం చేయడంతో పార్కును చాలాకాలంపాటు మూసివేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో ఏడాది కిందట రక్షణగోడ నిర్మించి, పాడైపోయిన పరికరాలకు మొక్కుబడిగా రిపేరు చేసి తిరిగి పార్కును అందుబాటులోకి తెచ్చారు. కొద్దిరోజులకే మళ్లీ ఆట పరికరాలు పాడైపోయినా, వాటిని రిపేరు చేయించడంపై జీవీఎంసీ అధికారులు దృష్టిసారించకపోవడం విశేషం. విరిగిపోయిన జారుడు బల్లలపైనే చిన్నారులు ఆడుతుండడం, దివ్యాంగులు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటుచేసి డ్రమ్ములు కిందపడిపోవడంతో కేవలం ఐరన్ ఫ్రేమ్ మాత్రమే మిగిలి ఉంది. చిన్నారులను బాస్కెట్ లాంటి తొట్టెలో దింపి చుట్టూ తిప్పే పరికరం బేరింగ్‌లు పాడైపోయి ఏడాదిపైగా గడిచిపోయింది. అయినప్పటికీ రిపేరు చేయకపోవడంతో అవన్నీ నిరుపయోగంగానే మారిపోయాయి.

దయనీయంగా ముడసర్లోవ పార్కు పరిస్థితి

జీవీఎంసీ పార్కుల్లో అతిపెద్దదిగా ముడసర్లోవ పార్కుకు గుర్తింపు ఉంది. సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉన్న పార్కు కావడంతో నగరంలో పిక్నిక్‌లు, ఫంక్షన్లు, గెట్‌టుగెదర్ పార్టీలు వంటి వాటికి ముడసర్లోవ పార్కును వేదికగా ఎంపికచేసుకుంటారు. అటువంటి పార్కు నిర్వహణపై జీవీఎంసీ నిర్లక్ష్యం వహించడంతో ఆట పరికరాలన్నీ పాడైపోయి మూలకు చేరిపోయాయి.

అంతేకాకుండా పార్కు నిర్వహణ కు నిధులు కేటాయింపు తగ్గించేయడంతో పచ్చదనం కనుమరుగైంది. పార్కులోని వాటర్ ఫౌంటెయిన్ కూడా పనిచేయడం లేదు. అక్కడి పరిస్థితులు చికాకు కలిగించేలా మారడంతో పార్కు వైపు వెళ్లడానికి నగరవాసులు ఆసక్తి చూపడం లేదు. నగరంలోని ప్రధానమైన పార్కులను జీవీఎంసీ గాలికి వదిలేయడంపై నగరవాసులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిపై జీవీఎంసీకి చెందిన ఇంజనీరింగ్ అధికారి వద్ద ప్రస్తావించగా జీవీఎంసీ పార్కుల నిర్వహణకు కేటాయింపులను పూర్తిగా తగ్గించేయడంతోనే తాము గతంలో మాదిరిగా ప్రాధాన్యం ఇవ్వలేకపోతున్నామని నిట్టూర్చారు.

ప్రాణాలు తీస్తున్న చీప్ లిక్కర్

... 7వ పేజీ తరువాయి

తప్పనిసరి పరిస్థితుల్లో దానినే తాగుతున్నారు. దీనివల్ల మద్యం తాగినవారి ఆరోగ్యం కొద్దికాలానికే దెబ్బతింటోంది. నాణ్యత లేని ముడిసరకులు, విపరీతమైన ఫ్లేవర్స్, రంగులు వినియోగించడం, కిక్ పెరగడానికి సింథటిక్ కెమికల్‌ను మోతాదుకు మించి వాడడం వల్ల నాసిరకం మద్యం సేవించిన వారిలో ముందుగా కాలేయం పనితీరు దెబ్బతింటోంది. అలాగే జీర్ణాశయం దెబ్బతిని ఆకలి మందగిస్తోంది. దీనివల్ల పోషకాహారలోపం తలెత్తి రక్తహీనతకు దారితీస్తోంది. రక్తహీనత దరిచేరగానే కంటి సమస్యలు వచ్చి దృష్టిలోపం తలెత్తుతోంది. వీటన్నింటి కారణంగా మద్యం తాగిన వ్యక్తి చూస్తుండగానే శక్తిని కోల్పోయి పనిచేయలేని స్థితిలో మంచానపడిపోతున్నాడు. నాసిరకం మద్యం కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా, ప్రాణాలు పోతున్నా వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు.

కేజీహెచ్‌కు రోజుకు 30 వరకూ కేసులు

నాసిరకం మద్యం సేవించి అనారోగ్యం బారినపడినవారు, మద్యానికి బానిసైనవారు (వారి ఆ సమస్య నుంచి బయటకు తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు తీసుకువస్తున్నారు) ప్రతిరోజూ 30 మంది వరకూ కేజీహెచ్‌కు వస్తున్నారు. మద్యానికి బానిసలుగా మారిన వారిని ఆ అలవాటు నుంచి బయటపడేసేందుకు వీలుగా కేజీహెచ్‌లో ప్రత్యేకంగా డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. కేజీహెచ్‌లో ఓపీ తీసుకున్న వారిని వైద్యులు, మానసిక నిపుణుల సమక్షంలో కౌన్సెలింగ్ చేస్తారు. తర్వాత వారికి మందులు ఇచ్చి మద్యం అలవాటు నుంచి క్రమంగా బయటపడేసేందుకు కృషిచేస్తారు. ఓపీకి వచ్చిన వారిలో కాలేయం, జీర్ణాశయం, కిడ్నీలు వంటివి దెబ్బతిన్నట్టు వైద్యులు భావిస్తే వారిని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చేర్పించి చికిత్స అందజేస్తారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఇన్‌పేషెంట్లుగా నిత్యం 50 మంది వరకూ చికిత్స పొందుతుంటారని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నా, వైద్యులు మాత్రం అలాంటివారు తమ వద్ద ఎవరూ చికిత్స తీసుకోవడం లేదనే బుకాయిస్తుంటారు. మద్యం సేవించడం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో రెండు, మూడు రోజులకొకరు ప్రాణాలు కోల్పోతున్నా, వైద్యులు మాత్రం నెలకు ఒకటి, రెండుకు మించి ఉండవని చెబుతున్నారు.

మద్యం బాధితులకు పురందేశ్వరి పరామర్శ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గత ఏడాది డిసెంబరులో కేజీహెచ్‌ను సందర్శించి నాసిరకం మద్యం కారణంగా అనారోగ్యం పాలై గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. అప్పటికి 52 మంది వార్డులో చికిత్స పొందుతుండగా వారిలో 39 మంది కేవలం మద్యం కారణంగానే అనారోగ్యం పాలయ్యారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం పేరుతో వైసీపీ నేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, దీనిపై సీబీఐ విచారణ జరపాలని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రికి ఆమె లేఖ కూడా రాశారు.

ఐదు రోజులు మంటలే..

... 7వ పేజీ తరువాయి

ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశాలో తొమ్మిది జిల్లాలకు వడగాడ్పుల హెచ్చరికలను ఆ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసింది. అలాగే 26-28వ తేదీల మధ్య కేరళలో, 27-29 మధ్య కొంకణ్ ప్రాంతంలో, 28-30 మధ్య పశ్చిమ ఉత్తరప్రదేశ్, కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ ప్రకటించింది. శుక్ర, శనివారాల్లో పంజాబ్ హరియాణాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఎన్నికల ప్రచారంపై ప్రభావం

ఇదిలావుండగా ఎల్‌నినో బలహీనపడినా ఇంకా దాని అవశేషాల ప్రభావంతో పసిఫిక్ మహాసముద్రం నుంచి వస్తున్న వేడి గాలులు భారత ఉపఖండంలో మరింత వేడినిపెంచుతున్నాయని సీనియర్ వాతావరణ శాస్త్రవేత్త ఒకరు పేర్కొన్నారు. దీని ప్రభావంతో దేశం మొత్తంనిప్పుల కుంపటిలా మారిందని, వచ్చేనెలలో మరింత వేడిగాలులు వీస్తాయని, పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటతాయని హెచ్చరించారు. వడగాడ్పుల ప్రభావం ఎన్నికల ప్రచారం, పోలింగ్‌పై పడనుందన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

... 7వ పేజీ తరువాయి

లేవని తిరస్కరించారు. విశాఖ ఉత్తరం నియోజకవర్గంలో మొత్తం 24 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో 16 నామినేషన్లు ఆమోదించారు. మరో ఎనిమిదింటిని తిరస్కరించారు. గొంప గోవిందరావు, గొంప త్రివేణి, పి.శ్యామల, జి. కమలాకరరావు, కె.బాలాజీ, కె.మమత, ఎం.సరోజిని, సాహితి నామినేషన్లు తిరస్కరించారు.

దక్షిణ నియోజకవర్గానికి మొత్తం 20 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరిది తిరస్కరించారు. వైసీపీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ప్రత్యామ్నాయంగా ఆయన సతీమణి ఉషారాణి దాఖలుచేసిన నామినేషన్‌ను తిరస్కరించారు. పశ్చిమలో మొత్తం దాఖలైన 18 నామినేషన్లలో 2 నామినేషన్లను తిరస్కరించారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గణబాబు, ఆడారి ఆనందకుమార్‌కు ప్రత్యామ్నాయంగా పెతకంశెట్టి మౌర్య, ఆడారి మాలతి వేసిన నామినేషన్లను తిరస్కరించారు. 16 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్లు ఆర్వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పెందుర్తిలో 20 మంది నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో ఒకరి నామినేషన్ తిరస్కరించారు. వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ప్రత్యామ్నాయంగా ఆయన సతీమణి శిరీష నామినేషన్‌ను తిరస్కరించారు. గాజువాకలో 21 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయగా 16 మంది నామినేషన్లను ఆమోదించి ఐదుగురివి తిరస్కరించారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పల్లా శ్రీనివాసరావు, గుడివాడ అమర్‌నాథ్‌లకు ప్రత్యామ్నాయంగా పల్లా కార్తీక్‌యాదవ్, ఆర్.హిమగౌరి దాఖలు చేసిన నామినేషన్లు తిరస్కరించారు. ఇంకా ఎం.రాంబాబు, చోడవరపు శంకర్, పి.సత్యనారాయణమూర్తి నామినేషన్లు తిరస్కరించారు.

అదీప్‌రాజ్, ఎంవీవీ నామినేషన్లపై టీడీపీ అభ్యంతరం

పెందుర్తి, విశాఖ తూర్పు పరిధిలో తప్ప మిగిలినచోట్ల మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తయింది. పెందుర్తిలో వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన నామినేషన్‌లో క్రిమినల్ కేసుల వివరాలు ప్రస్తావించకపోవడంతో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అభ్యంతరం తెలపడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. విశాఖ తూర్పులో వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చదువు విషయంలో 2019లో అఫిడవిట్‌కు, తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్‌కు మధ్య బోలెడు తేడా ఉండడంతో టీడీపీ నుంచి పట్టాభి అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఎన్నికల పరిశీలకుడు వచ్చి వివరణ ఇచ్చేంత వరకు ఉత్కంఠ కొనసాగింది. చివరికి ఇద్దరి నామినేషన్లను ఆమోదించారు.

గుర్తు తెలియని వివాహిత మృతదేహం లభ్యం

విశాలాక్షినగర్, ఏప్రిల్ 26: జీవీఎంసీ 9వ వార్డు సీతకొండ మలుపు తీరంలో శుక్రవారం రాత్రి మహిళా మృతదేహాన్ని ఆరిలోవ పోలీసులు గుర్తించారు. ఏఎస్‌ఐ నరసింగ్ తెలిపిన వివరాలు ప్రకారం... సీతకొండ మలుపు ప్రాంతంలో మహిళ మృతదేహం ఉందని సమాచారం అందడంతో ఆరిలోవ పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతురాలి వయస్సు 32 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, కాళ్లకు మట్టెలు ఉండడంతో వివాహితగా భావిస్తున్నా మని పోలీసులు చెప్పారు..



కొత్త నక్కవానిపాలెం పార్టీ కార్యాలయంలో వైసీపీలో చేరిన వారితో ఆడారి ఆనంద్‌కుమార్



91వ వార్డులో ప్రచారం సాగిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, తదితరులు

పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి 'ఆడారి'

91, 92 వార్డుల్లో ఆనంద్‌కుమార్ ప్రచారం, బైక్ ర్యాలీ

మల్కాపురం, ఏప్రిల్ 26: పార్టీ కోసం పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, పార్టీని నమ్ముకున్న వారికి ఎన్నడూ అన్యాయం జరగదని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు కొత్తనక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 61వ వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, యువకులు వైసీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి ఆనంద్‌కుమార్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వైసీపీ వార్డు అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు (వాసు), ఏసీఎస్ క్లస్టర్ కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా..

గోపాలపట్నం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 91వ వార్డు పరిధి బాజీ జంక్షన్, పాత గోపాలపట్నం ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే తపనతోనే రాజకీయాలకు అతీతంగా గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. 'పశ్చిమ' ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతానన్నారు. వైసీపీ సమన్వయకర్తగా గత ఏడాదిన్నర కాలంలో కోట్లాది రూపాలయతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఓటర్లకు వివరించారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతానన్నారు. అందువల్ల ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరుతూ ప్రజలకు మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, పరిశీలకురాలు పేడాడ రమణికుమారి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం 91, 92 వార్డుల పరిధిలోని గోపాలపట్నం, బాజీ జంక్షన్, పాత గోపాలపట్నం, ఎస్సీ కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఆడారి ఆనంద్ కుమార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.



అతిథులతో నటులు సంతోష్, రవిప్రకాశ్, శ్యామల, తదితరులు

'ఫర్ ఫ్యామిలీస్' షూటింగ్ ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 26: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని బాలాజీ దివ్య క్షేత్రంలో శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఎస్టీబీఎల్ సినీ వరల్డ్ సమర్పణలో డి.డి.మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న మొదటి చిత్రం (ప్రొడక్షన్ నంబర్-1) 'ఫర్ ఫ్యామిలీస్' సినిమా షూటింగ్ ప్రారంభమైంది. టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిగా విచ్చేసి వేంకటేశ్వరస్వామిని హీరో సతీశ్, నటులు రవిప్రకాశ్, శ్యామల దర్శించుకునే సన్నివేశానికి క్లాప్ కొట్టగా, వైసీపీ నాయకుడు తిప్పల దేవన్‌రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు మాట్లాడుతూ ఎస్టీబీఎల్ సినీ వరల్డ్ సమర్పణలో డి.డి.మూవీస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రం పూర్తి వినోదాత్మకమైన కుటుంబ కథా చిత్ర మన్నారు. నేటి యాంత్రిక యుగంలో చిన్న చిన్న మనస్పర్థలకే అనేక కుటుంబాలు విడిపోతున్నాయని, ఈ కథాంశంతో విభిన్న వయసులు గల మూడు జంటల మధ్య చోటుచేసుకున్న సమస్యలను వినోదాత్మకంగా, సందేశాత్మకంగా చిత్రీకరించనున్నామన్నారు. డైరెక్టర్ భాను మొగలిపువ్వు మాట్లాడుతు టి.సంతోష్‌నాయుడు, జి డియర్ దినేశ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో ఓ హీరోగా నిర్మాత సంతోశ్‌తో పాటు సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్, పవిత్ర, రవిప్రకాశ్, శ్యామల, ఆస్ట్రేలియాకు చెందిన యువతి, తదితరులు నటిస్తున్నారన్నారు.

1,170వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 26: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1,170వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉక్కు పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమల సంక్షేమమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం కావాలన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను విక్రయాలకు పెడుతున్న కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం దారుణమన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు దేశాన్ని తిరోగమనం వైపు నడిపిస్తాయన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమన్నారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** మెలోడీ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 25, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 22, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 28, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 30, బరబాటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 74, ఆగాకర 72, పొటల్స్ 40, కీరదోస 22, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



మలునాయుడుపాలెంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 26: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టాలని పెందుర్తి నియోజకవర్గ జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని మొగలిపురం గ్రామ దేవత బండితల్లికి శుక్రవారం పూజలు చేశాక టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మొగలిపురం, మలునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదివలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, ఒమ్మివానిపాలెం గ్రామాల్లో ప్రచారం చేశారు. కూటమి నేతలకు మహిళలు తిలకం దిద్ది హారతులు పట్టారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లా డుతూ రానున్న ఎన్నికల్లో కూటమి విజయం చారిత్రక అవసరమన్నారు. అన్ని రంగాల్లో అథోగతిపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. సొంతూరుకు రోడ్లు వేయించుకోలేని ఎమ్మెల్యే లోకల్, నాన్ లోకల్ అంటూ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పంచ గ్రామాల సమస్య పరిష్కరించిన తరువాతే మిమ్మల్ని ఓట్లు అడుగుతానని బీరాలు పలికిన ఎమ్మెల్యే.. ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనకు గాజు గ్లాసు, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గండి బాబ్జీ మాట్లాడుతూ వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే గ్రామాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మీరు బెదిరేస్తే బెదిరిపోవడానికి మేము సిద్ధంగా లేమని, ఖబడ్దార్ అంటూ గుల్లిపల్లి సభలో హెచ్చ రించారు. కూటమి సభలకు వెళ్లినా, ఓటేసినా సంక్షేమ పథకాలు నిలిపేస్తామని ఇక్కడ నేతలు ప్రజలను భయపెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలకు చిరునామా టీడీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొర్లి రామునాయుడు, కర్రి కనకరాజు, భరణికాన బాబూరావు, టి.బంగారు నాయుడు, జి.దేముడు, బి.నారాయణమూర్తి, జి.నరసింగరావు, జి.సూర్యనారాయణ, బి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

'పంచకర్ల' సతీమణి ప్రచారం

పెందుర్తి: జనసేన పార్టీ పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబును గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి మహాలక్ష్మి మండలంలోని సరిపల్లి, జంగాలిపాలెంలో ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని ఉపాధి హామీ పథక పనులు నిర్వహిస్తున్న కూలీలతో ఆమె మాట్లాడారు. ఉపాధి పనుల వల్ల ఎంత ఆదాయం వస్తుంది, గ్రామాల్లో అందరికీ ఉపాధి లభిస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉపాధి కూలీల వేతనం పెంపునకు, పని ప్రదేశంలో భద్రత, మెరుగైన సౌకర్యాల కల్పనకు చంద్రబాబు, పవన్, మోదీ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి తన భర్తను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, సర్పంచ్‌లు గొర్లె రామకృష్ణ, గొరపల్లి నరసింగరావు, నాయకులు కె.రామునాయుడు, ఎ.అప్పారావు, జి.రమేశ్, ఎం.రవి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు



మహిళా కూలీలతో పంచకర్ల రమేశ్‌బాబు సతీమణి మహాలక్ష్మి, తదితరులు

ఘనంగా ఆదిశక్తి ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం, ఏప్రిల్ 26: స్థానిక పద్మనాభనగర్‌లోని ఆదిశక్తి మానసాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన పూజాది కార్యక్రమాల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గణబాబును సాదరంగా స్వాగతించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

ఇక్కడి కొత్తపాలెంలోని శ్రీ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పి.గణబాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన డాన్ని ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 26: టీడీపీ గెలుపుతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని ఆ పార్టీ 86వ ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో శుక్రవారం రాత్రి సూపర్ సిక్స్ పథకాలు, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' పై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ పాలన వల్ల జరిగిన నష్టాలను వివరించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, పి.మురళీమోహన్, అల్లు రామారావు, నాగార్జున, వెంకటేశ్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ పలు ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం చేశారు. విశాఖ ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్‌ను, గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావులను గెలిపించాలని కోరారు. నాయకులు బాసెట్టి అప్పారావు, వియ్యపు వెంకన్న, చంద్రమ్మ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో పల్లా శ్రీనివాసరావు

యువతను మోసం చేసిన జగన్

టీడీపీ గాజువాక నియోజకవర్గం అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

'దేశం'లో చేరిన వైసీపీ యూత్ వింగ్ అధ్యక్షుడు రాజేశ్, తదితరులు

గాజువాక, ఏప్రిల్ 26: యువతను మోసం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక వైసీపీ యూత్ వింగ్ అధ్యక్షుడు ఎ.రాజేశ్‌తో పాటు ఇతర పార్టీలకు చెందిన మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి పల్లా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించకుండా నిరుద్యోగులుగా మార్చిందని విమర్శించారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. దుర్మార్గ ఆలోచనలు, అరాచక పాలనతో అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు జగన్నాథరావు, వెంకటరమణ, సింహాద్రి, రమణ, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వైసీపీకి బుద్ధి చెప్పాలి

అగనంపూడి: రాష్ట్రంలో అవినీతి, అరాచక, దౌర్జన్య పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వానికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా తగిన బుద్ధి చెప్పవలసిందిగా టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కోరారు. 85వ వార్డు పరిధి అగనంపూడి బొర్రమాంబ ఆలయంలో కూటమి శ్రేణులతో కలిసి పల్లా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. అవినీతి, దోపిడీలు, దౌర్జన్యాలు తప్ప ఎక్కడా అభివృద్ధికి చోటులేకుండా పోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గాజువాక నియోజవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గాజువాక నియోజకవర్గంలో తనకే మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని, గతంలో ఎమ్మెల్యేగా ఎన్నో సమస్యలను పరిష్కరించానన్నారు. అలాగే తలారివానిపాలెం, దిబ్బపాలెం, శనివాడ, ఎస్సీకాలనీ, దానబోయినపాలెం, కొండయ్యవలస, పెదమడక, కర్రివానిపాలెం గ్రామాల్లో పల్లా ప్రచారాన్ని చేపట్టారు. ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు, నాయకులు కర్రి దోశేంద్ర, గవర సోమశేఖర్, ఏదూరి గౌరినాయుడు, ఎం.వెంకటరమణ, ఎం.శ్రీను, జి.అప్పారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



85వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు



గవర కంచరపాలెంలో ప్రచారం చేస్తున్న గణబాబు, తదితరులు

రాష్ట్ర భవిత కోసం బాబు సీఎం కావాలి

టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు

ఆర్పీ పేట, (కంచరపాలెం), ఏప్రిల్ 26: రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం చారిత్రాక అవసరమని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు అన్నారు. 56వ వార్డు పరిధి గవరకంచరపాలెంలో శుక్రవారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా ఇవి ఉంటాయన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం గాడిలో పడుతుందని, అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. ఈసారి జరిగే ఎన్నికలు ఎంతో కీలకమైనవని, అందువల్ల అందరూ ఒకసారి ఆలోచించి ఓట్లు వేయాలనా కోరారు. ఒకసారి చాన్స్ ఇస్తేనే రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిన జగన్, మరోసారి అవకాశం ఇస్తే ఊహించుకోలేమన్నారు. పిల్లలు, యువత భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించవలసిందిగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా గణబాబుకు మహిళలు, యువకులు పూలమాలలు వేసి, మంగళహారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, మళ్ల శంకరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

జీవీఎంసీ 57వ వార్డు పరిధి సిద్ధార్థనగర్‌కు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ పశ్చిమ అభ్యర్థి, ఎమ్మెల్యే గణబాబు సమక్షంలో 'దేశం'లో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. తామంతా చంద్రబాబు మేనిఫెస్టో నచ్చి, గణబాబు చేసిన నియోజకవర్గం అభివృద్ధిని చూసి టీడీపీలో చేరామన్నారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్ బాబు, లక్ష్మి, ఎ.సంతోశ్, నాయుడుబాబు, నాగు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో గణబాబు

షీలానగర్‌లో సర్దార్ ప్రాజెక్ట్స్ నూతన వెంచర్ ఆవిష్కరణ



నూతన వెంచర్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న గౌతు శిరీష, తదితరులు... పక్కన భూమి పూజ చేస్తున్న శిరీష

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 26: పారిశ్రామిక ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సర్దార్ ప్రాజెక్ట్స్ సంస్థ షీలానగర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న 'సర్దార్ 101 ఎంపైర్ వెంచర్‌ను శుక్రవారం ప్రారంభించారు. షీలానగర్ అనురాధ పెట్రో సర్వీస్ వెనక ఉన్న వెంచర్ స్థలంలో ఏర్పాటు చేసిన వేదికపై ముందుగా వైభవంగా శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, ప్రాజెక్టు సిబ్బంది సమక్షంలో శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గ కూటమి అభ్యర్థి గౌతు శిరీష వెంచర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వెంచర్ స్థలంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో సొంతింటి కలను నిజం చేయడమే సర్దార్ ప్రాజెక్ట్స్ లక్ష్యంగా నిర్మాణాలు చేపడుతుందన్నారు. షీలానగర్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని విమానాశ్రయానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తున్న ఈ నూతన వెంచర్ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఈ నూతన వెంచర్‌ను అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా రూపొందుతుందన్నారు. ఈ ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, నారెడ్కో సభ్యులు చక్రధర్, గిరితో పాటు వై.రమేశ్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మికులపై ఆర్థిక భారం తగదంటూ వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 26: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఉద్యోగులపై విద్యుత్ చార్జీల పేరిట ఆర్థిక భారం వేయడం తగదని, ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేకు శుక్రవారం ఇంటక్ ఉక్కు ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని స్థితిలో యాజమాన్యం ఉన్న క్రమంలో కార్మికులపై ఆర్థిక మోపడం సరికాదన్నారు. కార్మికులను ఇబ్బందులు గురి చేసే చర్యలను యాజమాన్యం మానుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, తదితరులు ఉన్నారు.

మే డే వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 26: తెలుగుదేశం పార్టీ అనుబంధ కార్మిక సంస్థ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఈ ఏడాది మే డే వేడుకలను పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు పేర్కొన్నారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందలాది మంది కార్మికులతో వేడుకలను జరుపుతామన్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ దయనీయ పరిస్థితికి రావడానికి కారణం వైసీపీ ప్రభుత్వమేనని, ప్లాంట్ స్థితిగతులపై ఒకరోజు కూడా సీఎం జగన్ ప్రధాని దృష్టికి తీసుకువెళ్లలేదని ఆరోపించారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ రాష్ట్రానికే తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్రకుమార్, సింహాద్రి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

విశాఖపట్నం, ఏప్రిల్ 26: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. ఈ నెల 30న జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎంవీపీలోని ఎస్‌వీవీపీవీఎంసీ డిగ్రీ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

గాజువాక నియోజకవర్గంలో ఆరు నామినేషన్లు తిరస్కృతి

గాజువాక, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గాజువాక నియోజకవర్గంలో 21 మంది అభ్యర్థులు 32 నామినేషన్‌లు దాఖలు చేయగా శుక్రవారం చేపట్టిన పరిశీలనలో 26 నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఆమోదించారు. ఆరు నామినేషన్‌లను తిరస్కరించారు. వీరిలో పల్లా కార్తీక్ యాదవ్ (టీడీపీ), గుడివాడ అమర్‌నాథ్ సతీమణి ఆర్.హిమగౌరి (రెండు సెట్లు), ఎం.రాంబాబు (సీపీఎం), చోదవరపు శంకర్ (జనవాహిని పార్టీ), పి.సత్యనారాయణమూర్తి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) నామినేషన్లు ఉన్నాయి.

'పెందుర్తి'లో ఒకటి..

పెందుర్తి: పెందుర్తి నియోజవర్గానికి సంబంధించి ఒక నామినేషన్‌ను తిరస్కరించినట్టు ఈఆర్వో శేషశైలజ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి 20 మంది అభ్యర్థుల నుంచి 33 నామినేషన్లు అందగా, వీటిలో వైసీపీ అభ్యర్థి అదీప్‌రాజ్‌కు డమ్మీగా వేసిన ఆయన సతీమణి శిరీష నామినేషన్‌ను తిరస్కరించామన్నారు. మిగిలిన అభ్యర్థుల వివరాలను ఈఆర్వో కార్యాలయంలోని నోటీసు బోర్డులో పెట్టామన్నారు.

పశ్చిమ'లో రెండు..

జ్ఞానాపురం: పశ్చిమ నియోజకవర్గానికి దాఖలైన మొత్తం 30 నామినేషన్లలో రెండింటిని తిరస్కరించినట్టు ఈఆర్వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. టీడీపీ నుంచి పెతకంశెట్టి మౌర్యసింహ, వైసీపీ నుంచి ఆడారి మాలతిల నామినేషన్లను తిరస్కరించారు. 16 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించామన్నారు.

పలుచోట్ల విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఎన్.ఎ.డి, జంక్షన్, ఏప్రిల్ 26: ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ విస్తృతంగా తనఖీలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఎన్ఎస్‌టీఎల్ హైవే, బుచ్చిరాజుపాలెం, హైవే పరిసరాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది కార్లు, అనుమానిత వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా వాహనాలు ఎక్కడకు వెళుతున్నాయి, రూ.50 వేలకు పైబడి నగదుతో పాటు ఇతర సామగ్రి ఏమైనా తరలిస్తున్నారా వంటి అంశాలపై ఆరా తీస్తూ వాహనాలకు ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్-2 ఇన్‌చార్జి రత్నాకర్, ఏఎస్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీని వ్యాపార సంస్థగా మార్చేశారు

▸▸ జగన్‌పై ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు ధ్వజం

సీతమ్మధార, ఏప్రిల్ 26: ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని వ్యాపార సంస్థగా మార్చి ఏటా రూ.30వేల కోట్లు దోచుకున్నట్లు ఆధారాలున్నాయని ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీకి ఓటు వేస్తే పిల్లల భవిష్యత్తుకు ఉరితాడు వేసినట్టేనన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీల కూటమి అభ్యర్థిగాతనకు 40 వేల మెజారిటీ వస్తుందన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, వేల్పూరు శ్రీనివాసరావు, నాయకులు సురేష్ బాబు, త్రినాథ్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.



51వ వార్డులో ప్రచారం చేస్తున్న విష్ణుకుమార్‌రాజు

51వవార్డులో ప్రచారం

మాధవధార; విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వవార్డు సీతన్న గార్డెన్స్, ఏకలవ్య కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఉమ్మడి అభ్యర్థి పి. విష్ణుకుమార్ రాజు నాయకులతో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని అన్నారు.ఏకలవ్య కాలనీ వాసులు తమ సొంతింటి కల నెరవేరడం లేదని విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నార్త్ ఇన్‌చార్జి మహమ్మద్ నజీర్, జనసేన సమన్వయకర్త ఉషాకిరణ్ తదితరులు, బీజేవైఎం నాయకులు దిలీప్, టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి కార్యకర్తలు ఉన్నారు.

విష్ణుకుమార్‌రాజు కుమార్తె ప్రచారం

సీతమ్మధార: ఉత్తర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కుమార్తె శ్యామల దీపిక కోరారు. ఈ మేరకు ఆమె గురుద్వారా ఆటో స్టాండ్‌లో డ్రైవర్లను కలిసి కమలంగుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. పలు ప్రాంతాల్లో స్థానికులకు కలిసి కరపత్రాలను పంచిపెట్టారు.



మహిళకు కరపత్రాలందిస్తున్న శ్యామల దీపిక

48వార్డులో విస్తృత ప్రచారం

కంచరపాలెం: ఉత్తర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, విశాఖ ఎంపీ భరత్‌ను గెలిపించాలని కోరుతూ, 48వవార్డులో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు సత్యాడ అప్పారావు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ

మహారాణిపేట, ఏప్రిల్ 26: కూటమి అభ్యర్థుల గెలుపు ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్య మంత్రిని చేయటమే ధ్యేయంగా కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాల యంలో దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి నియమితులైన సీతంరాజు సుధాకర్‌ను నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ వైసీపీలో పనిచేసే కార్యకర్తలకు విలువ లేదని, టీడీపీలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలను గుర్తిస్తుందన్నారు. రాష్ట్రానికి చంద్ర బాబు నాయకత్వం అవసరమని, అందుకే తనతోపాటు వందలాది మంది టీడీపీలో చేరామన్నారు. వైసీపీ కార్యకర్తలకు గానీ, ప్రజలకు గాని ఉపయోగపడదని ఆలస్యంగా గుర్తించామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న గండిబాబ్జీ

దక్షిణంలో కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యం: సీతంరాజుసుధాకర్

జగదాంబ కూడలి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి దక్షిణ అభ్యర్థి వంశీ కృష్ణ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని టీడీపీ దక్షిణం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం 35వ వార్డు రామకృష్ణా జంక్షన్ వద్ద టీడీపీ ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా నియోజవర్గాన్ని దోచుకుతిన్న వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్ ఓడించాలన్నారు. ముందుగా టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని సీనియర్ కార్పొరేటర్ కొప్పుల వెంకటరరావు ప్రారంభించారు. కార్య క్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, గోడి నరసింహాచారి, కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, నాయకులు ఎర్నాగుల జగదీష్, నందమూరి అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

విశాఖపట్నం, ఏప్రిల్ 26: భువనేశ్వర్ ప్రాంతానికి చెందిన కర్రి మోహనరెడ్డి (42) అనేవ్యక్తి విశాఖ రైల్వే స్టేషన్‌లో అదృశ్యమైనట్టు స్థానిక రైల్వే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 11న భువనేశ్వర్ నుంచి విశాఖ చేరుకున్న మోహన్‌రెడ్డి తన భార్యతో వీడియోకాల్ మాట్లాడిన తర్వాత మొబైల్ స్విచ్చాఫ్ అయింది. తర్వాత ఇంటికి చేరకపోవడం, ఫోన్ చేయకపోవడంతో విశాఖ పరిసరాల్లో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో మోహన్‌రెడ్డి భార్య శుక్రవారం రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి తెలుపుఛాయతో బ్లాక్ కలర్ ప్యాంటు, వైట్ కలర్ టీ షర్టు ధరించినట్టు, ఆచూకీ తెలిసినవారు జీఆర్పీ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు ఫోన్: 9440627547 లేదా ఎస్ఐ జి.శ్రీనివాస్ 9866413487కు సమాచారమివ్వాలన్నారు. రైటప్ :

శతశాతం ఓటింగ్‌కు స్వీప్

జిల్లా నోడల్ అధికారి రామారావు



ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో శతశాతం ఓటింగ్ నమోదుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వీప్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమశాఖ సంచాలకులు కె.రామారావును నియమించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో స్వీప్ కార్యక్రమాల నిర్వహణకు ప్రతి నియోజకవర్గానికి 21 మంది చొప్పున సిబ్బందిని నియమించారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇంటింటా ఓటరు చైతన్యం ద్వారా ప్రతి ఒక్కరూ ఓటు వేయాల్సిన ఆవశ్యతకను తెలియజేస్తారు. ఓటర్ల హక్కులు, విధులను కరపత్రాల రూపంలో అందిస్తారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బూత్ స్థాయి చైతన్య సంఘాలు ఏర్పాటు చేసి చైతన్యపర్చనున్నారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు రామారావు వెల్లడించారు.



ఐటీ రంగ ప్రతినిధులతో విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి శ్రీభరత్ సమావేశం



హోటల్ మర్చెంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీభరత్

ఐటీ పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళికలు

▸▸ టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

సిరిపురం, ఏప్రిల్ 26 : నగరంలో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని ప్రణాళికలు రూపొందిస్తామని విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి ఎం. శ్రీభరత్ అన్నారు. శుక్రవారం ఆయన బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఐటీ రంగానికి చెందిన ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లుగా విశాఖలో ఐటీ రంగం అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఐటీ రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని విమర్శించారు. ఐటీ కంపెనీలకు చెల్లించాల్సిన రాయితీల బకాయిలు చెల్లించకపోవడం, కొత్త వాటిని ప్రోత్సహించకపోవడంతో ఉన్న కంపెనీలు కూడా ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన అనేక కంపెనీలు వైసీపీ తీరు వల్ల వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. ప్రస్తుతం విశాఖలో ఉద్యోగ అవకాశాలు లేక ఎంతోమంది యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖలో ఐటీ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. చంద్రబాబునాయుడు చొరవ వల్ల హైదరాబాద్‌లో ఐటీ రంగం బాగా స్థిరపడిందని, ఇక్కడికి కూడా స్కిల్ బెస్ కోర్సులను తీసుకొచ్చి స్థానిక యువతకు శిక్షణ ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో విశాఖ ఐటీ పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై పరిశ్రమల పరిస్థితిని భరత్‌కు వివరించారు.

ఆతిథ్య రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తాం

మహారాణిపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో ఆతిథ్య రంగానికి పరిశ్రమ హోదా కల్పించేందుకు కృషి చేస్తామని విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం. శ్రీభరత్ తెలిపారు. హోటల్ దసపల్లాలో శుక్రవారం విశాఖ హోటల్ మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఆతిథ్య రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖలో ఆతిథ్యరంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి మరింత మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశానికి వచ్చిన ప్రతినిధులనుంచి ఆయన వివరాలను కోరారు. విశాఖలో 1500 వరకు హోటల్స్, రెస్టారెంట్లు ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 1.80 లక్షల మంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా పర్యాటక రంగం కుంటుపడటంతో దాని ప్రభావం ఆతిథ్య రంగంపై చూపినట్టు వివరించారు. దీనితో మనుగడ సాగించడం కష్టతరం అవుతుందని తెలిపారు. అనంతరం భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాత్రి 12 గంటల వరకు హోటల్స్ నిర్వహించుకొనేలా జీవో ఇస్తామన్నారు. విశాఖలో ఐటీతోపాటు ఆతిథ్య పరిశ్రమ కూడా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చేయడం ద్వారా ఆతిథ్యం రంగానికి ఊతమిచ్చినట్లవుతుందని వివరించారు.

స్థానిక ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈసమావేశంలో కూటమి నియోజకవర్గ అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు , విష్ణుకుమార్ రాజు, గణబాబు, పల్లా శ్రీనివాస్ , నాయకులు సీతంరాజు సుధాకర్, ఒమ్మి సన్యాసిరావు, కందుల నాగరాజు, సాయిరాం సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో హోటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.



29వ వార్డులో హైపర్‌ఆదితో కలిసి ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ



చెంగలరావుపేట మసీదు కమిటీ పెద్దలు భేటీ

పాలన మారాలి.. కూటమి ప్రభుత్వం రావాలి

▸▸ దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీ కృష్ణ

మహారాణిపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో వైసీపీ పాలనను ఓడించి.. కూటమి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ, సినీ, జబర్దస్త్ నటుడు హైపర్‌ఆది అన్నారు. 29వ వార్డు చందకవీధి, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేటల్లో కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ.. హైపర్‌ఆదితో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమయ్యారు. అసెంబ్లీకి గాజు గ్లాసు గుర్తు, ఎంపీకి సైకిల్ గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావటం తథ్యమని అన్నారు. ఈ సందర్భంగా హైపర్‌ఆదితో యువత సెల్ఫీలు తీసుకునేందుకు జనాలు పోటీపడ్డారు. కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ, కండిపల్లి సతీశ్, పుచ్చా విజయ్ కుమార్, చొల్లంగి శేఖర్, గణేష్, బుద్దల అనురాధ పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి చేయూత

పూర్ణామార్కెట్: ముస్లిం వర్గాల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. 36వ వార్డు చెంగలరావుపేట మసీద్ ఏరియాలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల అభివృద్ధితోపాటు వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు చేపడతామన్నారు. ఈ నేపథ్యంలో ముస్లిం మసీద్ కమిటీ పెద్దలు ఆయనను కలిసి సంపూర్ణమద్దతు ప్రకటించారు.

అక్కయ్యపాలెం: దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా సినీ, జబర్దస్ నటుడు హైపర్ ఆది 27వ వార్డు దొండపర్తిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామాలయంవీధిలో ప్రారంభమైన ప్రచారం పలు ప్రాంతాల్లో సాగింది. కార్యక్రమంలో 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు పాలికల బాబి, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కూటమిని గెలిపించాలి

▸▸ ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయన్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26: రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అధికారంలో వచ్చిన తర్వాత విశ్రాంత ఉద్యోగులకు ఒకటో తేదీన రావాల్సిన పెన్షన్ ప్రతినెలా 20వ తేదీ వరకు చెల్లించడంలేదన్నారు. నాలుగున్నరేళ్లుగా పీఆర్సీ లేకుండా చేశారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పెన్షనర్లకు 10 శాతం పెంచి పెన్షన్ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా చంద్రబాబు 40 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినట్టు గుర్తుచేశారు. జగన్‌ను వైఎస్సార్ కుమారుడిగా భావించామని, అయితే, నాలుగున్నరేళ్లుగా పెన్షనర్లకు అన్యాయం చేశారని మండిపడ్డారు. మెడికల్ బిల్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని, హెల్త్‌కార్డులను అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పవిత్రమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద డ్యూటీ వేసి అప్రతిష్ట పాలుచేశారన్నారు. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని, విశాఖలో రుషికొండను బోడిగుండు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. 32 వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ స్థితిలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రావాలన్నా సమర్థత కలిగిన చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జనరల్ సెక్రటరీ పెద్దన్న గౌడ్, సెక్రటరీ పీఎస్ఎస్ మూర్తి, కోశాధికారి టి. నాగభూషణం, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

అధ్వానంగా పార్కులు

... 7వ పేజీ తరువాయి

రక్షణ గోడ కూలిపోయినా తిరిగి నిర్మించడంలో జాప్యం చేయడంతో పార్కును చాలాకాలంపాటు మూసివేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో ఏడాది కిందట రక్షణగోడ నిర్మించి, పాడైపోయిన పరికరాలకు మొక్కుబడిగా రిపేరు చేసి తిరిగి పార్కును అందుబాటులోకి తెచ్చారు. కొద్దిరోజులకే మళ్లీ ఆట పరికరాలు పాడైపోయినా, వాటిని రిపేరు చేయించడంపై జీవీఎంసీ అధికారులు దృష్టిసారించకపోవడం విశేషం. విరిగిపోయిన జారుడు బల్లలపైనే చిన్నారులు ఆడుతుండడం, దివ్యాంగులు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటుచేసి డ్రమ్ములు కిందపడిపోవడంతో కేవలం ఐరన్ ఫ్రేమ్ మాత్రమే మిగిలి ఉంది. చిన్నారులను బాస్కెట్ లాంటి తొట్టెలో దింపి చుట్టూ తిప్పే పరికరం బేరింగ్‌లు పాడైపోయి ఏడాదిపైగా గడిచిపోయింది. అయినప్పటికీ రిపేరు చేయకపోవడంతో అవన్నీ నిరుపయోగంగానే మారిపోయాయి.

దయనీయంగా ముడసర్లోవ పార్కు పరిస్థితి

జీవీఎంసీ పార్కుల్లో అతిపెద్దదిగా ముడసర్లోవ పార్కుకు గుర్తింపు ఉంది. సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉన్న పార్కు కావడంతో నగరంలో పిక్నిక్‌లు, ఫంక్షన్లు, గెట్‌టుగెదర్ పార్టీలు వంటి వాటికి ముడసర్లోవ పార్కును వేదికగా ఎంపికచేసుకుంటారు. అటువంటి పార్కు నిర్వహణపై జీవీఎంసీ నిర్లక్ష్యం వహించడంతో ఆట పరికరాలన్నీ పాడైపోయి మూలకు చేరిపోయాయి.

అంతేకాకుండా పార్కు నిర్వహణ కు నిధులు కేటాయింపు తగ్గించేయడంతో పచ్చదనం కనుమరుగైంది. పార్కులోని వాటర్ ఫౌంటెయిన్ కూడా పనిచేయడం లేదు. అక్కడి పరిస్థితులు చికాకు కలిగించేలా మారడంతో పార్కు వైపు వెళ్లడానికి నగరవాసులు ఆసక్తి చూపడం లేదు. నగరంలోని ప్రధానమైన పార్కులను జీవీఎంసీ గాలికి వదిలేయడంపై నగరవాసులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిపై జీవీఎంసీకి చెందిన ఇంజనీరింగ్ అధికారి వద్ద ప్రస్తావించగా జీవీఎంసీ పార్కుల నిర్వహణకు కేటాయింపులను పూర్తిగా తగ్గించేయడంతోనే తాము గతంలో మాదిరిగా ప్రాధాన్యం ఇవ్వలేకపోతున్నామని నిట్టూర్చారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

... 7వ పేజీ తరువాయి

లేవని తిరస్కరించారు. విశాఖ ఉత్తరం నియోజకవర్గంలో మొత్తం 24 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో 16 నామినేషన్లు ఆమోదించారు. మరో ఎనిమిదింటిని తిరస్కరించారు. గొంప గోవిందరావు, గొంప త్రివేణి, పి.శ్యామల, జి. కమలాకరరావు, కె.బాలాజీ, కె.మమత, ఎం.సరోజిని, సాహితి నామినేషన్లు తిరస్కరించారు.

దక్షిణ నియోజకవర్గానికి మొత్తం 20 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరిది తిరస్కరించారు. వైసీపీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ప్రత్యామ్నాయంగా ఆయన సతీమణి ఉషారాణి దాఖలుచేసిన నామినేషన్‌ను తిరస్కరించారు. పశ్చిమలో మొత్తం దాఖలైన 18 నామినేషన్లలో 2 నామినేషన్లను తిరస్కరించారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గణబాబు, అడారి ఆనందకుమార్‌కు ప్రత్యామ్నాయంగా పెతకంశెట్టి మౌర్య, అడారి మాలతి వేసిన నామినేషన్లను తిరస్కరించారు. 16 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్లు ఆర్వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పెందుర్తిలో 20 మంది నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో ఒకరి నామినేషన్ తిరస్కరించారు. వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ప్రత్యామ్నాయంగా ఆయన సతీమణి శిరీష నామినేషన్‌ను తిరస్కరించారు. గాజువాకలో 21 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయగా 16 మంది నామినేషన్లను ఆమోదించి ఐదుగురివి తిరస్కరించారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పల్లా శ్రీనివాసరావు, గుడివాడ అమర్‌నాథ్‌లకు ప్రత్యామ్నాయంగా పల్లా కార్తీక్‌యాదవ్, ఆర్.హిమగౌరి దాఖలు చేసిన నామినేషన్లు తిరస్కరించారు. ఇంకా ఎం.రాంబాబు, చోడవరపు శంకర్, పి.సత్యనారాయణమూర్తి నామినేషన్లు తిరస్కరించారు.

అదీప్‌రాజ్, ఎంవీవీ నామినేషన్లపై టీడీపీ అభ్యంతరం

పెందుర్తి, విశాఖ తూర్పు పరిధిలో తప్ప మిగిలినచోట్ల మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తయింది. పెందుర్తిలో వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన నామినేషన్‌లో క్రిమినల్ కేసుల వివరాలు ప్రస్తావించకపోవడంతో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అభ్యంతరం తెలపడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. విశాఖ తూర్పులో వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చదువు విషయంలో 2019లో అఫిడవిట్‌కు, తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్‌కు మధ్య బోలెడు తేడా ఉండడంతో టీడీపీ నుంచి పట్టాభి అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఎన్నికల పరిశీలకుడు వచ్చి వివరణ ఇచ్చేంత వరకు ఉత్కంఠ కొనసాగింది. చివరికి ఇద్దరి నామినేషన్లను ఆమోదించారు.

ప్రాణాలు తీస్తున్న చీప్ లిక్కర్

... 7వ పేజీ తరువాయి

తప్పనిసరి పరిస్థితుల్లో దానినే తాగుతున్నారు. దీనివల్ల మద్యం తాగినవారి ఆరోగ్యం కొద్దికాలానికే దెబ్బతింటోంది. నాణ్యత లేని ముడిసరకులు, విపరీతమైన ఫ్లేవర్స్, రంగులు వినియోగించడం, కిక్ పెరగడానికి సింథటిక్ కెమికల్‌ను మోతాదుకు మించి వాడడం వల్ల నాసిరకం మద్యం సేవించిన వారిలో ముందుగా కాలేయం పనితీరు దెబ్బతింటోంది. అలాగే జీర్ణాశయం దెబ్బతిని ఆకలి మందగిస్తోంది. దీనివల్ల పోషకాహారలోపం తలెత్తి రక్తహీనతకు దారితీస్తోంది. రక్తహీనత దరిచేరగానే కంటి సమస్యలు వచ్చి దృష్టిలోపం తలెత్తుతోంది. వీటన్నింటి కారణంగా మద్యం తాగిన వ్యక్తి చూస్తుండగానే శక్తిని కోల్పోయి పనిచేయలేని స్థితిలో మంచానపడిపోతున్నాడు. నాసిరకం మద్యం కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా, ప్రాణాలు పోతున్నా వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు.

కేజీహెచ్‌కు రోజుకు 30 వరకూ కేసులు

నాసిరకం మద్యం సేవించి అనారోగ్యం బారినపడినవారు, మద్యానికి బానిసైనవారు (వారి ఆ సమస్య నుంచి బయటకు తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు తీసుకువస్తున్నారు) ప్రతిరోజూ 30 మంది వరకూ కేజీహెచ్‌కు వస్తున్నారు. మద్యానికి బానిసలుగా మారిన వారిని ఆ అలవాటు నుంచి బయటపడేసేందుకు వీలుగా కేజీహెచ్‌లో ప్రత్యేకంగా డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. కేజీహెచ్‌లో ఓపీ తీసుకున్న వారిని వైద్యులు, మానసిక నిపుణుల సమక్షంలో కౌన్సెలింగ్ చేస్తారు. తర్వాత వారికి మందులు ఇచ్చి మద్యం అలవాటు నుంచి క్రమంగా బయటపడేసేందుకు కృషిచేస్తారు. ఓపీకి వచ్చిన వారిలో కాలేయం, జీర్ణాశయం, కిడ్నీలు వంటివి దెబ్బతిన్నట్టు వైద్యులు భావిస్తే వారిని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చేర్పించి చికిత్స అందజేస్తారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఇన్‌పేషెంట్లుగా నిత్యం 50 మంది వరకూ చికిత్స పొందుతుంటారని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నా, వైద్యులు మాత్రం అలాంటివారు తమ వద్ద ఎవరూ చికిత్స తీసుకోవడం లేదనే బుకాయిస్తుంటారు. మద్యం సేవించడం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో రెండు, మూడు రోజులకొకరు ప్రాణాలు కోల్పోతున్నా, వైద్యులు మాత్రం నెలకు ఒకటి, రెండుకు మించి ఉండవని చెబుతున్నారు.

మద్యం బాధితులకు పురందేశ్వరి పరామర్శ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గత ఏడాది డిసెంబరులో కేజీహెచ్‌ను సందర్శించి నాసిరకం మద్యం కారణంగా అనారోగ్యం పాలై గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. అప్పటికి 52 మంది వార్డులో చికిత్స పొందుతుండగా వారిలో 39 మంది కేవలం మద్యం కారణంగానే అనారోగ్యం పాలయ్యారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం పేరుతో వైసీపీ నేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, దీనిపై సీబీఐ విచారణ జరపాలని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రికి ఆమె లేఖ కూడా రాశారు.

ఐదు రోజులు మంటలే..

... 7వ పేజీ తరువాయి

ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశాలో తొమ్మిది జిల్లాలకు వడగాడ్పుల హెచ్చరికలను ఆ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసింది. అలాగే 26-28వ తేదీల మధ్య కేరళలో, 27-29 మధ్య కొంకణ్ ప్రాంతంలో, 28-30 మధ్య పశ్చిమ ఉత్తరప్రదేశ్, కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ ప్రకటించింది. శుక్ర, శనివారాల్లో పంజాబ్ హరియాణాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఎన్నికల ప్రచారంపై ప్రభావం

ఇదిలావుండగా ఎల్‌నినో బలహీనపడినా ఇంకా దాని అవశేషాల ప్రభావంతో పసిఫిక్ మహాసముద్రం నుంచి వస్తున్న వేడి గాలులు భారత ఉపఖండంలో మరింత వేడినిపెంచుతున్నాయని సీనియర్ వాతావరణ శాస్త్రవేత్త ఒకరు పేర్కొన్నారు. దీని ప్రభావంతో దేశం మొత్తంనిప్పుల కుంపటిలా మారిందని, వచ్చేనెలలో మరింత వేడిగాలులు వీస్తాయని, పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటతాయని హెచ్చరించారు. వడగాడ్పుల ప్రభావం ఎన్నికల ప్రచారం, పోలింగ్‌పై పడనుందన్నారు.

గుర్తు తెలియని వివాహిత మృతదేహం లభ్యం

విశాలాక్షినగర్, ఏప్రిల్ 26: జీవీఎంసీ 9వ వార్డు సీతకొండ మలుపు తీరంలో శుక్రవారం రాత్రి మహిళా మృతదేహాన్ని ఆరిలోవ పోలీసులు గుర్తించారు. ఏఎస్ఐ నరసింగ్ తెలిపిన వివరాలు ప్రకారం.. సీతకొండ మలుపు ప్రాంతంలో మహిళ మృతదేహం ఉందని సమాచారం అందడంతో ఆరిలోవ పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతురాలి వయస్సు 32 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, కాళ్లకు మట్టెలు ఉండడంతో వివాహితగా భావిస్తున్నా మని పోలీసులు చెప్పారు..

భీమిలిలో 3 నామినేషన్లు తిరస్కృతి

భీమునిపట్నం, ఏప్రిల్ 26 : భీమిలి అసెంబ్లీ స్థానానికి 20 నామినేషన్లు దాఖలు కాగా మూడింటిని తిరస్కరించినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ల పరిశీలన పూర్తయిందని, కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ప్రత్యామ్నాయ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఆయన తనయుడు గంటా రవితేజ, కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజుకు డమ్మీగా నామినేషన్ వేసిన ఆయన సతీమణి స్వప్న అడ్డాల, వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ప్రత్యామ్నాయ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి నామినేషన్లు తిరస్కరించినట్టు చెప్పారు. 17మంది నామినేషన్లను ఆమోదించామన్నారు.

ఘనంగా ఏయూ వ్యవస్థాపక దినోత్సవం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 26 : ప్రపంచంలోనే ఏయూకు ప్రత్యేక స్థానం ఉందని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ 99వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని ఏయూ పరిపాలన భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి వర్సిటీ పనిచేస్తోందన్నారు. గతంలో పనిచేసిన వీసీలు అందించిన ప్రమాణాలు, విలువలను నేటికీ కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఏయూలో 59 దేశాలకు చెందిన వెయ్యి మందికి పైగా విదేశీ విద్యార్థులు చదువుతున్నారని, స్టార్టప్, ఇంక్యుబేషన్ అంశాల్లో ప్రతిఒక్కరికి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మేధో హక్కుల దినోత్సవం పురస్కరించుకుని ఏయూలో నూతనంగా పీజీ డిప్లొమా ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కోర్సును ప్రారంభించారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మాజీ వీసీలు ఆవిష్కరించారు. అనంతరం ఈ ఏడాది అత్యధిక పేటెంట్‌లు సాధించిన ఆచార్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీలు బీల సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, బాల మోహన్‌దాస్, పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు కుమార్ రాజు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల గడువు పెంచాలి

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 26 : భీమిలి నియోజకవర్గంలో పనిచేస్తూ అదర్ పోలింగ్ పర్సన్ (ఓపీఓ)లుగా నియమితులైన వారికి పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు సమర్పించే గడువును పొడిగించాలని పలువురు కోరుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3తో గడువు ముగియడంతో చాలామంది దరఖాస్తులు తీసుకోలేదు. పీఓ, ఓపీఓలుగా నియమితులైన వారికి మొదటి శిక్షణ నిర్వహించిన కేంద్రంలో దరఖాస్తు, ఆధార్ కార్డు, ఓటర్ ఎపిక్ నంబర్లు తీసుకున్నారు. వారికి పోస్టల్ బ్యాలెట్‌లు అందుతాయని చెబుతున్నారు. ఓపీఓలుగా నియమితులైన వారికి శిక్షణ లేకపోవడంతో వారికి శుక్రవారం దరఖాస్తులు సమర్పించే గడువుగా ప్రకటించారు.అయితే సరైన ప్రచారం లేకపోవడం వల్ల చాలామంది దరఖాస్తులు ఎక్కడ అందించాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. ముందు తాముంటున్న ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయాల్లో ఇవ్వాలని చెప్పారు. ఈమేరకు చాలామంది అక్కడికి వెళితే అందరూ భీమిలి వెళ్లాలని చెప్పడంతో చాలామంది సకాలంలో రాలేకపోయారు. దీంతో అధికారులు వారి దరఖాస్తులను తీసుకోలేదు. సరైన సమాచారం లేకపోవడంతో తాము దరఖాస్తులను అందించలేకపోయామని చెబుతున్నారు. దరఖాస్తుల గడువును ఈనెలాఖరు వరకు పొడిగించాలని వారు కోరుతున్నారు.

'బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి'

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 26 : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. శుక్రవారం ఆయన ఈనెల 30న జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీవీఎంసీ డిగ్రీ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని కోరారు.

ఘనంగా మేధో సంపత్తి హక్కుల దినోత్సవం

సాగర్‌నగర్, ఏప్రిల్ 26 : రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మేధో సంపత్తి హక్కుల దినోత్సవం పురస్కరించుకుని సృజనాత్మకత, సుస్థిర అభివృద్ధి అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్‌డీసీ అసిస్టెంట్ మేనేజర్ సుధా విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు.

సినిమా గైడ్

● **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)

● **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)

● **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)

● **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

● **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 25, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 22, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 150, బరబటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 32, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 74, ఆగాకర 72, పొటల్స్ 40, కీరదోస 22, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..



భీమిలిలో గంటాకు హారతులు పడుతున్న మహిళలు



చేపలుప్పాడలో జరిగిన ప్రచార సభలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

జగన్ ఓటమి ఖాయం

- భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యం
- భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 26 : వచ్చే ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయమని భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా 4వ వార్డు చేపలుప్పాడ, మంగమారిపేట, కొత్తవలస, జేవీ అగ్రహారంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యర్థి వర్గీయులు పలు విధాలుగా మత్స్యకారులను భయాందోళనకు గురిచేస్తున్నారని, వారికి మత్స్యకారుల దెబ్బ ఎలా వుంటుందో తెలియడం లేదన్నారు. గులకరాయితో జగన్‌ని హత్యాయత్నం చేశారట, ఈ సంఘటన వింటుంటే 2019 ఎన్నికలకు ముందు కోడికత్తి డ్రామా గుర్తుకు వస్తుందన్నారు. ఏమైనా ఈ ఎన్నికలతో జగన్ ఇంటి ముఖం పట్టక తప్పదని, కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని చెప్పారు. గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి, పొరబాటు చేశారని, ఈసారి మళ్లీ అటువంటి తప్పు చేస్తే భావితరాల వారికి అన్యాయం చేసిన వారమవుతామని, రాష్ట్ర భవిష్యత్ నాశనమవుతుందని గుర్తించుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సామాజిక సమస్యలతో పాటు డ్రగ్స్ ప్రధానంగా గంజాయి ఎక్కువైపోయిందని చెబుతుంటే బాధనిపిస్తుందన్నారు. యువత మత్తుకు బానిసలైపోన్నారని, దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు విశాఖ అని స్పష్టమవుతుందన్నారు. మరోవైపు కార్యకర్తల జోలికొస్తే సహించనని, ప్రత్యర్థులు జాగ్రత్తగా వుండాలన్నారు.

అనుమతి లేదని టెంట్లు తొలగింపు

మంగమారిపేట జంక్షన్‌లో నాలుగు లైన్ల రహదారిని ఒకవైపు మూసివేస్తూ టెంట్‌లు వేయడంతో పోలీసులు అనుమతి లేదని వాటిని తొలగించారు. మంగమారిపేటలో వైసీపీ నాయకులు, చేపల తిమ్మాపురం డ్రై ఫిష్ కోఆపరేటివ్ టౌన్ ఉమెన్ కో ఆపరేటివ్ సొసైటీ అడ్వయిజర్ మారుపల్లి అమరనాథ్, సొసైటీ అధ్యక్షురాలు మారుపల్లి పార్వతమ్మ, తదితరులు గంటాను దుశ్శాలువ కప్పి సన్మానించారు. తమ సభ్యులు ఇళ్ల నిర్మించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరారు. 4వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, నాయకులు కారి అప్పారావు, మైలపల్లి రాము, పాసి త్రినాథ్‌కుమార్, గరికిన ఎల్లయ్య కింగ్, గరికిన సుధ, వాసుపల్లి రామయ్యమ్మ, జనసేన వార్డు అధ్యక్షుడు గరికిన అప్పారావు, బీజేపీ నాయకులు ముల్లయ్య, శ్రీహరి, ధోని నాగరాజు, నియోజకవర్గ కన్వీనరు రామానాయుడు పాల్గొన్నారు.

బటన్ నొక్కుడు బ్రహ్మ విద్య కాదు

బటన్ నొక్కడం బ్రహ్మ విద్య కాదని గంటా శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం ఆయన కొత్తవలస, జేవీ అగ్రహారం, నిడిగట్టు, నేరేళ్లవలస, నగరపాలెం, సోమన్నపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలన అంటే అప్పులు చేసి బటన్ నొక్కి డబ్బులు వేయడం కాదన్నారు. పాలన అంటే పేదల సంక్షేమం చూడడం, పరిశ్రమలు రప్పించడం అని చెప్పారు.

బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంతో ఇక్కట్లు

సింహాచలం, ఏప్రిల్ 26 :బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా 98వ వార్డు పాతగోశాల కూడలి నుంచి పాత అడివివరం వరకు జరుగుతున్న పనుల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కారిడార్ నిర్మాణం సుదీర్ఘ కాలం తరువాత గత ఏడాది నవంబరు నుంచి ప్రారంభించారు. ఆరు నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ రోడ్డు స్థితిగతులు పూర్తి స్థాయిలో రూపుదాల్చలేదు. రోడ్డు ఎలైన్‌మెంటుతో కొన్ని సమస్యలను నిర్మాణానికి సహకరించిన స్థానికలు ఎదుర్కొంటున్నారు. అది చాలవన్నట్టు రోడ్డు కోసం తవ్వకాలు చేపట్టడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఘాట్‌రోడ్డు టోల్‌గేటు వద్ద, గాంధీనగర్ కూడలి, అడివివరంలోని భూలోకనగర్ కూడలి వద్ద ఇళ్లల్లోని వాడుక నీరు రోడ్లపై నిలిచిపోతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. .

రోడ్డును తవ్వి... వదిలేశారు



డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన గొయ్యి

కొమ్మాది, ఏప్రిల్ 26 : మిథిలాపురి ఉడా కాలనీ దరి బింద్రానగర్ నుంచి పీఎంపాలెం జాతీయ రహదారికి వెళ్లే రోడ్డులో డ్రైనేజీ కోసం రోడ్డు తవ్వి వదిలేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ నిర్మాణానికి అంటూ వారం రోజుల క్రితం రోడ్డు మొత్తం తవ్వేసి, పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వారు అవస్థలు పడుతున్నారు.

ఘనంగా పాదాలమ్మ పండగ

పద్మనాభం (రూరల్), ఏప్రిల్ 26 : మండలంలోని పాండ్రంగి గ్రామంలో పాదాలమ్మ పండుగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి పూజలు జరిపారు.



గొల్లలపాలెంలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న ముత్తంశెట్టి



వైసీపీలో చేరిన గొల్లలపాలెం యువకులతో అవంతి, తదితరులు



పాత మధురవాడలో చిన్నారిని ఎత్తుకున్న శ్రీనివాసరావు

వైసీపీతోనే ప్రజా సంక్షేమ పాలన : ముత్తంశెట్టి

భీమునిపట్నం, ఏప్రిల్ 26 : ప్రజల చెంతకే పాలన అందిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి మాత్రమే ఓటు వేయాలని అడిగే హక్కు వుందని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన గొల్లలపాలెం, కృష్ణాకాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో రూ.2,700 కోట్ల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గత 30 ఏళ్లుగా లేని అభివృద్ధిని ఈ ఐదేళ్ల కాలంలో చేసి చూపించామని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు జగన్ అన్నింటా పెద్ద పీట వేసారని, ఎన్నో పదవుల్లో అవకాశం ఇచ్చారన్నారు. చేయూత పథకంతో ఎంతోమంది మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందారని తెలిపారు. ఎవరెన్ని ఆరోపణలు, కుట్రలు చేసినా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం, తాను గెలవడం ఖాయమన్నారు. కాగా గొల్లలపాలెంలో పలువురు జనసేన కార్యకర్తలు ముత్తంశెట్టి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కోండ్రు రామసూరప్పుడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గెలుపుతోనే అభివృద్ధి

మధురవాడ : వైసీపీ గెలుపుతోనే భీమిలి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన ఏడో వార్డు పాత మధురవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు.అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని, ప్రతి మహిళ పథకాల్లో లబ్ధి పొందేలా చూశారన్నారు. నియోజకవర్గంలో వాడవాడలా అభివృద్ధి చేసిన ఘనత తనదేనని చెప్పారు. పాతమధురవాడలో తనకు లభించిన ఆదరణ చూస్తుంటే లక్ష మెజారిటీతో విజయం సాధిస్తానని నమ్మకం కుదిరిందన్నారు.ఎమ్మెల్యేగా మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కాగా ముత్తంశెట్టికి స్థానికులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. తీన్‌మార్ వాయిద్యాలతో మహిళలు హారతులు పట్టారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ పిళ్లా నూరిబాబు, కృష్ణమూర్తి పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.



23వ వార్డులో ప్రచారం చేస్తున్న రామకృష్ణబాబు



బాలాజీనగర్‌లో మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న తేజస్విని, పక్కన వెలగపూడి

టీడీపీతో పేదల బతుకుల్లో వెలుగులు

- విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజస్విని
- 11వ వార్డులో వెలగపూడితో కలిసి ప్రచారం

ఆరిలోవ, ఏప్రిల్ 26 : కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, పేదల బతుకుల్లో వెలుగు వస్తుందని విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజస్విని అన్నారు. శుక్రవారం ఆమె తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో వెలగపూడి రామకృష్ణబాబును ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 11వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ముగడ రాజారావు, ఒమ్మి సన్యాసిరావు, ఆబోతుల అప్పలనాయుడు, మూది అప్పారావు, కృష్ణంరాజు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, రేకా జ్యోతి, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ / ఎంవీపీ కాలనీ : వెలగపూడిని నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కుమారుడు వెలగపూడి ప్రతాప్‌బాబు ఓటర్లను అభ్యర్థించారు. 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. అలాగే వెలగపూడి సతీమణి సుజన ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులోని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డులో తూర్పు కూటమి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు ప్రచారం నిర్వహించారు. చైతన్యనగర్ వినాయక ఆలయంలో పూజలు జరిపి, అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తం, రాంబాబు, అప్పలరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు వికాస్, ఆనంద్ పాల్గొన్నారు.

'కూటమి గెలుపుతోనే సంక్షేమ పాలన'

మధురవాడ, ఏప్రిల్ 26 : భీమిలి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుతోనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఏడో వార్డు పరిధిలోని దోబీ కాలనీ, బాపూజీనగర్, శ్యామ్‌నగర్ ప్రాంతాల్లో కూటమి నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గంటాను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిళ్లా వెంకటరావు, పిళ్లా నరసింగరావు, కానూరి అచ్యుతరావు, నాగోతి సూర్యప్రకాశరావు, బయపల్లి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబును, శ్రీభరత్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి వివేకానందనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, రమణి, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : జీవీఎంసీ 2వ వార్డులోని రాయిపాలెం, నమ్మివానిపేట, డెక్కతిపాలెం, రాజలింగంపేట, సంగివలస గ్రామాల్లో గంటా శ్రీనివాసరావుకు మద్దతుగా కార్పొరేటర్ చిన్నకుమారి లక్ష్మి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి కూటమి అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, వైసీపీ తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రతన్ కాంత్, ప్రీతం, డెక్క ఈశ్వరరావు, బొండా రవి, అవినాష్, భరత్, కిరణ్ పాల్గొన్నారు. అలాగే 16వ వార్డులో నారు గోపి ఆధ్వర్యంలో ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ నుంచి వాటర్ ట్యాంకు వరకు, 15వ వార్డులో బుగత సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ నాయకులు ప్రచారం చేశారు.



18 వార్డులోని అప్పుఘర్ ప్రాంతంలో ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం

జనం కోసం జగన్ : ఎంవీవీ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 25 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జనం కోసం నిరంతరం కష్టపడుతున్నారని వైసీపీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన 18 వార్డు పరిధిలోని అప్పుఘర్, మూలపాలెం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ వైసీపీ అధికారంలోకి రావాలన్నారు.కుల మత వర్గాల తారతమ్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. తూర్పులో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్ర మంలో మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ పేర్ల విజయచందర్, నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, ఉమ్మిడి కళ్యాణ్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నాయకులతో కలిసి జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న ఎంవీవీ

పద్మనాభంలో 45 పోలింగ్ కేంద్రాలు

పద్మనాభం, ఏప్రిల్ 26 : మండలాన్ని ఎన్నికల అధికారులు ఐదు సెక్టార్లుగా విభజించారు. ఆయా సెక్టార్లకు ఇప్పటికే సెక్టోరల్ అధికారులను నియమించారు. సెక్టార్-1లో రెడ్డిపల్లి నుంచి చిన్నాపురం వరకు 11 పోలింగు కేంద్రాలు ఉండగా వాటి పర్యవేక్షణకు గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈ చిరంజీవికి అప్పగించారు. సెక్టారు-2లో అయినాడ నుంచి కోరాడ వరకు 8 కేంద్రాలు ఉండగా వాటి బాధ్యతను ఎంఈఓ రమణకు, సెక్టారు 3లో ఆర్‌వీ పురం నుంచి కృష్ణాపురం వరకు 10 కేంద్రాలు ఉండగా వాటి బాధ్యతను ఎంపీడీఓ కార్యాలయ ఏఓ పి. రాధకు, పద్మనాభం నుంచి విలాస్‌ఖాన్‌పాలెం వరకు 8 కేంద్రాల బాధ్యతను వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలంకు అప్పగించారు. అలాగే గంథవరం నుంచి గొల్లలపాలెం వరకు ఉన్న 8 కేంద్రాల బాధ్యతను ఈఓఆర్డీ కుమార్‌కు అప్పగించారు. వారికి సహాయకులుగా 10మంది రూట్ అధికారులను నియమించారు.

రెండు కేంద్రాల మార్పు

మండలంలో రెండు కేంద్రాల భవనాలను మార్పు చేశారు. రెడ్డిపల్లిలోని కేంద్రం-19 ఇప్పటివరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉండగా, భవనం శిథిలం కావడంతో ఈ కేంద్రాన్ని స్థానికంగా ఉన్న సామాజిక భవనంలోకి మార్చారు. అలాగే తునిపాలెం లోని 34 కేంద్రాన్ని మండల పరిషత్ పాఠశాల నుంచి స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేశారు.

విశాఖ పార్లమెంటు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు....

	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
విశాఖ తూర్పు	1,39,423	1,46,458	20	2,85,901
విశాఖ దక్షిణం	1,04,659	1,08,437	32	2,31,128
విశాఖ ఉత్తరం	1,38,098	1,41,955	21	2,80,074
విశాఖ పశ్చిమం	1,03,379	1,06,360	10	2,09,749
గాజువాక	1,64,462	1,63,479	13	3,27,954
భీమునిపట్నం	1,75,206	1,82,034	17	3,57,257
శృంగవరపుకోట	1,07,188	1,13,117	4	2,20,309
మొత్తం	9,32,415	9,61,840	117	19,12,372

ఓటరు మాట

రాష్ట్రం గురించి ఆలోచించాలి



రాష్ట్రాభివృద్ధికి దూరదృష్టితో ఆలోచించే నాయకుడితోనే ప్రజలకు మేలు జరుగుతుంది. తాత్కాలిక ఉపశమనం కల్పించే అంశాలకు విలువ ఇవ్వకూడదు. సమర్థత కలిగిన నేతను ఎన్నుకుంటే ఆశలు నెరవేరుతాయి. అభ్యర్థుల్లో ఇలాంటి వారిని గుర్తించి ఓటు వేయాలి.

- కొవిరి కోదండరావు,
ఉక్కు విశ్రాంత ఉద్యోగి, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్

దివాలా తీయించే ప్రభుత్వాలు వద్దు



రాష్ట్రాన్ని ఆర్థికంగా పటిష్టం చేసే సామర్థ్యమున్న నేతలను ఎన్నుకోవాలి. అప్పులపాలు చేసి, ఆర్థికంగా దివాలా తీయించిన పార్టీలను ఎన్నుకుంటే దారుణంగా దెబ్బతింటాం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సి ఉంది. అందుకు సంబంధించిన ప్రణాళికలను మేనిఫెస్టో ప్రకటించే పార్టీల అభ్యర్థులను గెలిపించుకుందాం. ఐదేళ్లకోసారి వచ్చే అవకాశాన్ని ఓటర్లంతా సద్వినియోగం చేసుకోవాలి. **- జి.రవివర్మ,**
రోటరీ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు, గాజువాక

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి



రాష్ట్రంలో అనేక నీటి ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయి. వాటిని పూర్తి చేసి, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించగలిగే అనుభవం ఉన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. కొత్త ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు తేవాలి. దీనివల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుంది. పేదల సంక్షేమానికి మంచి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయాలి.

- గొనప అప్పన్న,
సామాజిక కార్యకర్త, ఎంవీపీకాలనీ

బతుకులు బాగుపడాలి



బతుకులు బాగుచేసే సామర్థ్యమున్న నాయకులను ఎన్నుకోవాలి. నిరుపేదలను చేసే ప్రభుత్వాలతో ముప్పే. ధరల నియంత్రణ, నేరాలను అరికట్టగలిగే ప్రభుత్వాన్ని ఎన్నుకుందాం. ఐదేళ్లకోసారి వేసే ఓటు మన జీవితాల్ని మార్చేలా ఉండాలి. మరింత దిగజారకూడదు. మంచి అభ్యర్థులను, సమర్థ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.

- విజయభాస్కర్, న్యాయవాది, ఎంవీపీ కాలనీ

అరాచకాలను అడ్డుకోవాలి



శాంతి భద్రతలను కాపాడగల సమర్థత ఉన్న నేతలు అవసరం. అరాచకాలను సృష్టించే వారితో నిత్యం గండమే. శాంతిభద్రతల పరిరక్షణ పట్ల అవగాహన ఉన్న వారితో మేలు. అలాంటి ప్రజా ప్రతినిధులు చట్టసభలకు ఎన్నికైతే ప్రజా ప్రభుత్వం ఏర్పాటవుతుంది. ప్రజల కోసం ఆలోచించే వారిని గెలిపించుకోవాలి. రాష్ట్రంలో ఎప్పుడూ ప్రశాంత వాతావరణం నెలకొనాలి.

- డాక్టర్ పి.రాఘవేంద్రరావు,
ఐఐహెచ్‌పీ విశాఖ అధ్యక్షుడు, రామ్‌నగర్

ఎన్నికల వేడి మొద ▶ **మీరూ పంపించండి**

లయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుం టున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243



విశాఖ మహా నగరం

గ్రామీణ ఓటర్ల కంటే పట్టణ ఓటర్ల తీర్పు కాస్త భిన్నంగా ఉంటుంది. పార్టీలతో పాటు అభ్యర్థి, ఇతరత్రా అంశాలు కూడా ఫలితాలను నిర్దేశిస్తాయి. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం ఓటర్ల తీర్పును పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. విశాఖ నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్ కోట. అయితే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత రాజకీయ చిత్రం మారింది. 1957 నుంచి (1951లో ద్విసభ్యత్వ నియోజకవర్గంగా ఉండేది) ఇప్పటివరకూ మొత్తం పదహారుసార్లు ఎన్నికలు జరగగా కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా ఏడుసార్లు గెలుపొందగా, టీడీపీ మూడుసార్లు విజయం సాధించింది. బీజేపీ, వైసీపీ ఒక్కొక్కసారి గెలుపొందాయి.



పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లు

విశాఖ ఉత్తరం, తూర్పు, దక్షిణం, పశ్చిమ, గాజువాక, భీమునిపట్నం, శృంగవరపుకోట

విభిన్నం... విశాఖ ఫలితం

పార్టీతో పాటు అభ్యర్థి, ఇతర అంశాలకూ ప్రాధాన్యం

- ఏ పార్టీకీ దక్కని అప్రతిహత విజయం
- 1957 నుంచి ఇప్పటివరకూ 16సార్లు ఎన్నికలు
- ఏడుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు టీడీపీ విజయం
- బీజేపీ, వైసీపీ ఒకొక్కసారి
- ప్రస్తుతం ప్రాంతీయ పార్టీల మధ్యే పోటీ



తెన్నేటి విశ్వనాథం



పి.వి.జి.రాజు



భాట్టం శ్రీరామమూర్తి



ద్రోణంరాజు సత్యనారాయణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో విశాఖపట్నం కీలకమైన ప్రాంతం. ఏపీకి ఆర్థిక రాజధానిగా గుర్తింపుపొందింది. ఇక్కడ నుంచి ఎంపీగా ఎన్నికైనవారికి చెప్పాలంటే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. గత ఎన్నికల్లో బహుముఖ పోటీ జరిగింది. తెలుగుదేశం, వైసీపీ, బీజేపీ, జనసేన వేర్వేరుగా పోటీ చేశాయి. ఇంకా కాంగ్రెస్ సహా పలు పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నా టీడీపీ, వైసీపీ, జనసేన మధ్య ముక్కోణ పోటీ జరిగింది. ఇందులో వైసీపీ అభ్యర్థి స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఈసారి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. కూటమి తరపున ఎం.శ్రీభరత్ పోటీ చేస్తుండగా, వైసీపీ తరపున మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీ బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్య ప్రధాన పోటీ జరగనున్నది.

ఇదీ చరిత్ర

విశాఖ లోక్‌సభ నియోజకవర్గానికి 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి లంకా సుందరం...కాంగ్రెస్ అభ్యర్థి కె.సుబ్బరాజుపై విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో విజయనగరం రాజవంశానికి చెందిన పి.వి.జి.రాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.వి.కృష్ణారావుపై విజయం సాధించారు. 1962లో తొలిసారి ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. ఆ పార్టీ తరపున విజయనగరం రాజవంశానికి చెందిన విజయ్ ఆనంద్ (విజ్జీ) పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థి మద్ది సి.రెడ్డిపై గెలిచారు. 1967లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథం...కాంగ్రెస్ అభ్యర్థి పి.వెంకటరావును ఓడించారు. 1971 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్లీ పి.వి.జి.రాజు పోటీ చేసి, ఇండిపెండెంట్ అభ్యర్థి తెన్నేటి విశ్వనాథాన్ని ఓడించారు. 1977 ఎన్నికల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోయినా రాష్ట్రంలో మాత్రం ఘన విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో విశాఖ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ద్రోణంరాజు సత్యనారాయణ...కొత్తగా ఏర్పడిన జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథంపై దాదాపు 43 వేల ఓట్ల తేడాతో గెలిచారు. జనతా పార్టీలో చీలిక ఏర్పడడం, మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం కూలిపోవడంతో 1980లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున కొమ్మూరు అప్పలస్వామి పోటీ చేసి, కాంగ్రెస్ (యు) అభ్యర్థి భాట్టం శ్రీరామ్మూర్తిపై లక్షా 35 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు.

టీడీపీ రాకతో మారిన చిత్రం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత విశాఖ నియోజకవర్గంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. అప్పటి వరకు విజయాలు అటూ, ఇటూగా ఉంటే టీడీపీ ఆవిర్భావం తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. టీడీపీ ఆవిర్భావం తరువాత 1984లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేసిన భాట్టం శ్రీరామ్మూర్తి...కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి అప్పలస్వామిపై లక్షా 41 వేల ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన ఆ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం వీయగా రాష్ట్రంలో మాత్రం తెలుగుదేశం, మిత్రపక్షాలు ఘన విజయం సాధించడం గమనార్హం. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విజయనగరం రాజవంశీకుల కోడలు ఉమా గజపతిరాజు (పూసపాటి ఆనందగజపతిరాజు భార్య), టీడీపీ అభ్యర్థి ఎం.వి.వి.ఎస్.మూర్తిపై 26 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఎన్నికల అనంతరం కేంద్రంలో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడలేకపోయింది. 1991లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. గత అభ్యర్థులే మరోసారి ముఖాముఖి తలపడగా ఈసారి టీడీపీ అభ్యర్థి ఎం.వి.వి.ఎస్.మూర్తి 3,678 ఓట్ల మెజారిటీతో ఉమాగజపతిరాజుపై గెలిచారు. రాజీవ్‌గాంధీ హత్యానంతరం దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు సానుభూతి పవనాలు బలంగా వీచినా ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోవడం గమనార్హం. 1996 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన టి.సుబ్బిరామిరెడ్డి 6 వేల ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి పి.ఆనందగజపతిరాజుపై గెలిచారు. 1998లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కూడా మళ్లీ వీరిద్దరే తలపడ్డారు. ఈసారి కూడా సుబ్బిరామిరెడ్డినే విజయం వరించింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డి.వి.సుబ్బారావుకు లక్షా75 వేల ఓట్లు వచ్చాయి. 1999లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన ఎం.వి.వి.ఎస్.మూర్తి దాదాపు 40 వేల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బిరామిరెడ్డిపై గెలిచారు. ఇక 2004 ఎన్నికల్లో మూర్తి మరోసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి చేతిలో లక్ష పైచిలుకు ఓట్లతేడాతో ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి, టీడీపీ అభ్యర్థిగా ఎం.వి.వి.ఎస్.మూర్తి, ప్రజారాజ్యం తరపున పల్లా శ్రీనివాసరావు పోటీపడ్డారు. పురందేశ్వరి విజయం సాధించగా, పీఆర్పీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ద్వితీయ స్థానం సాధించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ కలిసి పోటీ చేశారు. జనసేన మద్దతు ప్రకటించింది. ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో దిగిన కంభంపాటి హరిబాబు (బీజేపీ) సుమా రు 90 వేల మెజారిటీతో వైసీపీ తరపున బరిలో దిగిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తల్లి విజయలక్ష్మిపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన వైసీపీ మధ్య పోటీ జరిగింది. వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు 4,36,906 ఓట్లు, తెలుగుదేశం అభ్యర్థి ఎం.శ్రీభరత్‌కు 4,32,496 ఓట్లు, జనసేన అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణకు 2,88,874 ఓట్లు, బీజేపీ అభ్యర్థినిగా పోటీ చేసిన దగ్గుబాటి పురందేశ్వరికి 33,892 ఓట్లు వచ్చాయి.



ఉమాగజపతిరాజు



ఎంవీవీఎస్ మూర్తి



టి.సుబ్బిరామిరెడ్డి



ఎన్.జనార్దనరెడ్డి



దగ్గుబాటి పురందేశ్వరి

1951 నుంచి 2019 ఎన్నికల వరకు విశాఖ నుంచి గెలుపొందిన ఎంపీలు

ఎన్నిక	విజేత	పార్టీ	మెజారిటీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1951	లంకా సుందరం	ఇండిపెండెంట్	----	ఇ.సీతయ్యనాయుడు	కేఎల్‌పీ
	కె.సుబ్బరాజు	కాంగ్రెస్	----	గాం మల్లుదొర	ఇండిపెండెంట్
1957	పీవీజీ రాజు	ఇండిపెండెంట్	61,114	ఎంవీ కృష్ణారావు	కాంగ్రెస్
1962	పి.విజయ్ ఆనంద్ (విజ్జీ)	కాంగ్రెస్	91,142	మద్ది పట్టాభిరెడ్డి	ఇండిపెండెంట్
1967	తెన్నేటి విశ్వనాథం	ఇండిపెండెంట్	34,073	పి.వెంకటరావు	కాంగ్రెస్
1971	పీవీజీ రాజు	ఇండిపెండెంట్	67,188	తెన్నేటి విశ్వనాథం	ఇండిపెండెంట్
1977	ద్రోణంరాజు సత్యనారాయణ	కాంగ్రెస్	42,829	తెన్నేటి విశ్వనాథం	జనతా
1980	కొమ్మూరు అప్పలస్వామి	కాంగ్రెస్(ఐ)	34,635	భాట్టం శ్రీరామ్మూర్తి	కాంగ్రెస్(యు)
1984	భాట్టం శ్రీరామ్మూర్తి	తెలుగుదేశం	1,40,431	కొమ్మూరు అప్పలస్వామి	కాంగ్రెస్
1989	పి.ఉమాగజపతిరాజు	కాంగ్రెస్	25,733	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం
1991	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం	5,138	పి.ఉమాగజపతిరాజు	కాంగ్రెస్
1996	టి.సుబ్బిరామిరెడ్డి	కాంగ్రెస్	7,279	పి.ఆనందగజపతిరాజు	తెలుగుదేశం
1998	టి.సుబ్బిరామిరెడ్డి	కాంగ్రెస్	61,517	పి.ఆనందగజపతిరాజు	తెలుగుదేశం
1999	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం	38,919	టి.సుబ్బిరామిరెడ్డి	కాంగ్రెస్
2004	ఎన్.జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్	1,30,571	ఎంవీవీఎస్ మూర్తి	తెలుగుదేశం
2009	డి.పురందేశ్వరి	కాంగ్రెస్	64,974	పల్లా శ్రీనివాసరావు	ప్రజారాజ్యం
2014	కంభంపాటి హరిబాబు	బీజేపీ	90,488	వైఎస్ విజయలక్ష్మి	వైసీపీ
2019	ఎంవీవీ సత్యనారాయణ	వైసీపీ	4,410	ఎం.శ్రీభరత్	తెలుగుదేశం

తొలి ఎన్నికల్లో ద్విసభ్యత్వ నియోజకవర్గం... ఇద్దరు ఎంపీలు



కంభంపాటి హరిబాబు



ఎంవీవీ సత్యనారాయణ

పార్లమెంటుకు 1951లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొన్ని ద్విసభ్యత్వ నియోజకవర్గాలు ఉండేవి. వాటిలో విశాఖపట్నం ఒకటి. ఒకరు జనరల్, మరొకరు రిజర్వుడ్ అభ్యర్థి ఉండేవారు. ప్రతి ఓటరుకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉంటుంది. అత్యధిక ఓట్లు వచ్చిన మొదటి ఇద్దరిని విజేతలుగా ప్రకటిస్తారు. 1951వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో విశాఖ నుంచి నలుగురు పోటీ చేయగా, గాం మల్లుదొర మధ్యలో పోటీ నుంచి వైదొలిగారు. మిగిలిన ముగ్గురిలో లంకా సుదరం (ఇండిపెండెంట్)కు 1,40,718 ఓట్లు, కె.సుబ్బరాజు (కాంగ్రెస్)కు 1,24,102 ఓట్లు, ఇ.సీతయ్యనాయుడు (ఇండిపెండెంట్)కు 74,656 ఓట్లు వచ్చాయి. దీంతో లంకా సుదరం, కె.సుబ్బరాజులను విజేతలుగా ప్రకటించారు. తరువాత ఎన్నికల నాటికి ద్విసభ నియోజకవర్గాలు రద్దయ్యాయి.

లోక్‌సభకు మహామహులు

పోరాట యోధుడు తెన్నేటి విశ్వనాథం, విజయనగరం రాజవంశానికి చెందిన పి.వి.జి.రాజు, కాంగ్రెస్ సీనియర్ నేత ద్రోణంరాజు సత్యనారాయణ, స్వాతంత్ర్య సమరయోధుడు భాట్టం శ్రీరామమూర్తి, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి వంటి మహామహులను లోక్‌సభకు పంపిన ఘనత విశాఖపట్నం ఓటర్లకే దక్కుతుంది.

మూడు తరాలుగా రాజకీయాల్లో...



మాజీ ఎమ్మెల్యే బోళెం గోపాత్రుడు (ఫైల్)

- సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకూ పలు పదవులు చేపట్టిన బోళెం గోపాత్రుడు కుటుంబం
- 1978 సంవత్సరంలో నర్సీపట్నం ఎమ్మెల్యేగా గోపాత్రుడు
- 2009లో శాసనసభ సభ్యురాలిగా ఆయన కోడలు ముత్యాలపాప
- ఎంపీపీలుగా గోపాత్రుడు, వెంకటరమణ, అరుణశ్రీ
- వేములపూడి సర్పంచులుగా బోళెం సన్యాసిపాత్రుడు, చెల్లయ్యమ్మ



మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, వెంకటరమణ



మాజీ ఎంపీపీ బోళెం అరుణశ్రీ

నర్సీపట్నం, ఏప్రిల్ 26: నర్సీపట్నం మండలంలోని వేములపూడికి చెందిన బోళెం గోపాత్రుడు కుటుంబంలో మొదటి తరం నుంచి మూడో తరం వరకూ ఏదో ఒక పదవి చేపట్టి ప్రజా ప్రతినిధులుగా రాణించారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, ఎమ్మెల్యే పదవులతో నేటికీ రాజకీయాలలో ఉనికిని చాటుకుంటున్నారు.

బోళెం గోపాత్రుడు ఎమ్మెల్యేగా, ఎంపీపీగా పనిచేశారు. ఆయన కుమారుడు సన్యాసిపాత్రుడు, కోడలు చెల్లయ్యమ్మ వేములపూడి సర్పంచులుగా చేశారు. వీరి పెద్ద కుమారుడు వెంకటరమణ, చిన్న కుమారుడు రామ్‌ప్రసాద్, ఇద్దరు ఆడ పిల్లలు. పెద్దకుమారుడు వెంకటరమణ రెండు పర్యాయాలు ఎంపీపీగా, ఒకసారి వైస్ ఎంపీపీగా చేశారు. పెద్దకోడలు బోళెం ముత్యాలపాప ఎంపీపీ, ఎమ్మెల్యే పదవులు చేపట్టారు. చిన్న కుమారుడు రామ్‌ప్రసాద్ వేములపూడి ఉప సర్పంచ్‌గా, ఆయన భార్య అరుణశ్రీ నర్సీపట్నం ఎంపీపీగా చేశారు. రామ్‌ప్రసాద్ ప్రస్తుతం వేములపూడి-1 సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బోళెం గోపాత్రుడు రెండుసార్లు (1972, 1978) నర్సీపట్నం అసెంబ్లీ నియోజక వర్గానికి పోటీ చేసి ఒక పర్యాయం విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గోపాత్రుడు... జనతా పార్టీ అభ్యర్థి రాజాసాగి సూర్యనారాయణరాజు పై విజయం సాధించారు. ఆ తరువాత మండల వ్యవస్థలో ప్రత్యక్ష పద్ధతిలో మొట్టమొదటిసారిగా జరిగిన ఎన్నికలలో బోళెం గోపాత్రుడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాళ్ళ నూకరాజుపై విజయం సాధించారు. ఆయన 1987 నుంచి 88 వరకు నర్సీపట్నం మండల అధ్యక్షుడుగా పదవిలో ఉన్నారు. ఆయన కాలం చేయడంతో ఎంపీపీ పదవికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికలలో ఆయన మనవడు బోళెం వెంకటరమణ ఎంపీపీగా పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత 1995 నుంచి 2000 వరకు ఎంపీపీగా, 2001 నుంచి 2006 వరకూ మండల ఉపాధ్యక్షుడుగా పదవులు చేపట్టారు. ఆ తర్వాత బోళెం వెంకటరమణ భార్య ముత్యాలపాప 2009 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడుపై విజయం సాధించారు. అలాగే 2009 నుంచి 2011 వరకు బోళెం వెంకటరమణ సోదరుడు రాంప్రసాద్ భార్య అరుణశ్రీ ఎంపీపీగా ఉన్నారు. 2009 నుంచి 2011 మధ్య కాలంలో బోళెం చెల్లయ్యమ్మ వేములపూడి సర్పంచ్‌గా, ఆమె పెద్ద కోడలు ముత్యాలపాప నర్సీపట్నం ఎమ్మెల్యేగా, చిన్న కోడలు అరుణశ్రీ నర్సీపట్నం ఎంపీపీ పదవిలో ఉండడం విశేషం.

ఒకటే వార్డు... రెండు నియోజకవర్గాల్లో ఓట్లు

సమ్‌థింగ్ స్పెషల్

- జీవీఎంసీ 98వ వార్డు ప్రత్యేకత

ఒకే వార్డు పరిధిలోని ఓటర్లు రెండు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించే అభ్యర్థులను ఎన్నుకోనున్నారు. ఈ ఘనత జీవీఎంసీ 98వ వార్డు వాసులకు దక్కింది. ఇక్కడి ఓటర్లలో కొంతమంది భీమిలి శాసనసభ అభ్యర్థి, విశాఖపట్నం లోక్‌సభ అభ్యర్థికి ఓట్లు వేయాల్సి ఉండగా, మరికొంతమంది ఓటర్లు పెందుర్తి శాసనసభ అభ్యర్థికి, అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థికి ఓట్లు వేయాల్సి ఉంటుంది. గతంలో జీవీఎంసీ 72వ వార్డుగా ఉండే సింహాచలం, దానికి ఆనుకుని ఉన్న గ్రామాలు పూర్తిగా పెందుర్తి నియోజకవర్గంలో ఉండేవి. అయితే వార్డుల విభజన నేపథ్యంలో ఇది 98వ వార్డుగా రూపాంతరం చెందింది. ఈ నేపథ్యంలో సింహాచలం గోశాల కూడలి నుంచి అడివివరం, లండగరువు, సింహగిరి గిరిజన గ్రామాలన్నీ భీమిలి నియోజకవర్గంలో విలీనమయ్యాయి. సాయినగర్, ప్రహ్లాదపురంలోని మోదీస్ట్రీట్, అప్పన్నపాలెం, సాయిమాధవనగర్ తదితర ప్రాంతాలు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 98వ వార్డుకు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టయింది. తాజా గణాంకాల ప్రకారం భీమునిపట్నం నియోజకవర్గంలో ఉన్న 98వ వార్డులో 16 పోలింగ్ బూత్‌లుండగా, 14,696 మంది భీమిలి ఎమ్మెల్యే, విశాఖ ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేస్తారు. అదే విధంగా ఐదో పోలింగ్ బూత్‌లలో సుమారు 7,290 మంది ఓటర్లు పెందుర్తి ఎమ్మెల్యే, అనకాపల్లి ఎంపీకి తమ ఓట్లు వేయాల్సి ఉంది. దాంతో వివిధ పార్టీలకు చెందిన నేతలు వార్డులోని కొంత భాగంలో భీమిలి శాసనసభ, విశాఖ ఎంపీ అభ్యర్థుల తరఫున, మరికొంతభాగంలో పెందుర్తి శాసనసభ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థుల తరఫున రెండు విధాలుగా ప్రచారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

● సింహాచలం

తేజస్విని ప్రచారోత్సాహం

విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ తరపున అతని సతీమణి తేజస్విని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఆరిలోవలో ఇలా సైకిల్ గుర్తును ఓటర్లకు చూపిస్తూ ఉత్సాహంగా ప్రచారం చేశారు.

- విశాఖపట్నం

